జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 02, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## రూ.24 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ నిధుల విడుదల

- నూతన సంవత్సరంలో సీఎం చంద్రబాబు తొలి సంతకం
- 1,600 మంది పేదలకు అందనున్న ఆర్థికసాయం



**అమరావతి,మహానాడు:** నూతన సంవత్సరం తొలిరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు లబ్ధి చేకూర్చేలా సీఎం ఆర్‌ఎఫ్ నిధుల విడుదలకు సంబంధించిన ఫైలుపై మొదటి సంతకం చేశారు. దీంతో 1,600 మంది దరఖాస్తు దారులకు రూ. 24 కోట్ల మేర నిధులు విడుదల కానున్నాయి. గత ఏడాది అధికారం చేపట్టిన దగ్గర నుంచి డిసెంబర్ 31 వరకు రూ. 100 కోట్లకుపైగా సీఎంఆర్‌ఎఫ్ నిధులు పేదవర్గాలకు ఇచ్చారు. 7,523 మందికి లబ్ధి కలిగింది. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా చేసిన సంతకంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సీఎంఆర్‌ఎఫ్ కోసం విడుదల చేసిన నిధుల మొత్తం రూ. 124.16 కోట్లకు చేరింది. 9,123 మంది మొత్తంమ్మీద ప్రయోజనం పొందినట్లయ్యింది.

# సకుటుంబ..సపరివార..స'మేత'ంగా!

- ఆ మంత్రి గారి రూటే సెప'రేటు'
- 'బరువు' బాధ్యతలన్నీ తండ్రి-బావలేనట
- 'బావగారి బంధం' బహు బాగట
- ఆ శాఖలో బావగారు చెప్పకపోతే ఫైలు కదలదట
- ఇసుక రీచ్, అన్నా క్యాంటీన్, జనరిక్ షాపులన్నీ అమలాపురానికేనట
- నియోజకవర్గం మారినా అంతా అమలాపురం వాసనలే
- పార్టీ మారినా పోని పాత వాసనలు
- ఆ నియోజకవర్గంలో అనాథగా మారిన టీడీపీ
- సొంత కులంలోనే తిరుగుబాటు
- మంత్రిగారిపై విశృంఖలంగా సొంత కులం నేతల పోస్టింగులు
- ఫ్యాక్టరీలో పేలుళ్లు జరిగితే కాసులపంటే
- ఫార్మా, కెమికల్ కంపెనీలో వసూల్‌రాజాలు
- థర్డ్‌పార్టీ ఏజెన్సీలు అడిగినంత ఇచ్చుకోవాల్సిందే
- ఓ అధికారి తమ్ముడికే ఏజెన్సీ ఇవ్వాలట
- తమ్ముడి కోసం ఇతర ఏజెన్సీలపై వేటు
- థర్డ్‌పార్టీ ఏజెన్సీలలో ఆయనే 'రాజు'
- విశాఖ వేదికగా పరిశ్రమల్లో 'వసూల్‌రాజా' జోరు
- 'సాన'బట్టిన నేత మేనేజర్‌తో కలసి వసూళ్ల పర్వం
- ఎన్నికల ఖర్చు రికవరీ చేసే ఉద్యమమట
- హడలిపోతున్న పారిశ్రామికవేత్తలు
- బాధితుల్లో కమ్మవారే ఎక్కువట
- లోకేష్‌కు ఫిర్యాదు చేసినా దక్కని ఫలితం

మహానాడు ఫోకస్

(మార్తి సుబ్రహ్మణ్యం)



చూడ్డానికి ఆ శాఖకు పెద్ద పనేమీ ఉండదనుకుంటారు. అందులో పెద్దగా ఏమీ రాలవనుకుంటారు. ఆ శాఖను వారంతా సకుటుంబ సపరివార స'మేత'ంగా పంచేసుకున్నారు. ఒక కొడుకు..ఒక తండ్రి.. ఒక బావ. అదీ ఆ శాఖలో సినిమా! మామూళ్ల విషయంలో సారు ఫ్యామిలీ 'చాలా స్ట్రిక్టు'గా ఉంటారట.

మంత్రిగారు ఎన్నికల్లో చేసిన ఖర్చు రికవరీ కోసం.. ఇటీవలే ప్రజాప్రతినిధి అవతారమెత్తిన ఓ యువ నేత బంధువుతో కలసి, విశాఖలో వ్యవహారాలు 'సాన'బెడుతున్నారట. విశాఖలోని ఫార్మా కంపెనీలు సహా ఇతర పెద్ద కంపెనీల్లో తరచూ జరిగే పేలుళ్లు, సారుకు కాసులు కురిపిస్తున్నాయట.అంటే పేలుడు జరిగితే పండగేనన్నమాట! పేలుడు జరిగిన వెంటనే తన శాఖ అధికారితో బావగారిని మాట్లాడిస్తున్నారట.

అంతేనా? ఫార్మా కంపెనీలో సేఫ్టీని తనిఖీ చేసి నివేదికలిచ్చే, సాదాసీదా థర్డ్ పార్టీ ఏజెన్సీ వారిని కూడా సారు విడిచిపెట్టడం లేదట. తన శాఖలోని ఫ్యాక్టరీస్ విభాగంలో పనిచేసే ఓ ఉన్నతాధికారి తమ్ముడికి ఉన్న సొంత ఏజెన్సీకే, థర్డ్‌పార్టీ ఆర్డరివ్వాలని హుకుం జారీ చేస్తున్నారట. పైగా తాను చెప్పిన రేటుకయితేనే ఏజెన్సీ పనిచేసుకోండి అని చెబుతున్నారట. ఈ విషయంలో బావగారు ఎంత చెబితే అంతట!

సకుటుంబ సపరివార స'మేతం'గా జరుగుతున్న ఈ వ్యవహారంతో విశాఖ, రాజమండ్రికి చెందిన కమ్మ పారిశ్రామికవేత్తలు హడిపోతున్నారట. వసూల్‌రాజా ధాటికి తట్టుకోలేక విలవిల్లాడుతున్నారట. గత ఎన్నికల్లో కులాభిమానంతో, పార్టీపై అభిమానంతో విరాళాలు అందించిన ఈ సామాజికవర్గ పారిశ్రామికవేత్తలు, మళ్లీ ఈ అదనపు బాదుడు భరించలేకపోతున్నారట. ఆ మధ్య లోకేష్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదట. విచిత్రమేమిటంటే.. బాధితులు ఎవరిపైనయితే ఫిర్యాదు చేస్తారో, ఆ ఫిర్యాదు కాపీ చివరాఖరకు సదరు అధికారి టేబుల్‌పైకే వెళ్లడం!

ఈ విషయంలో సారు ఫ్యామిలీ ఎవరు చెప్పినా 'చాలా స్ట్రిక్టుగా' ఉంటారట. గుంటూరు జిల్లాకుచెందిన ఓ టీడీపీ దళిత మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే చెప్పినా బేఖాతరన్నారంటే.. వసూళ్ల విషయంలో సారు ఫ్యామిలీ 'ఎంత స్ట్రిక్టు'గా ఉందో అర్థమవుతోంది. కదా? విశాఖ, రాజమండ్రి ప్రాంతాల్లో ఫార్మా కంపెనీలు ఎక్కువ. వీటిలో తరచూ పేలుళ్లు జరిగి కార్మికులు, ఉద్యోగులు చనిపోతున్న వైనం మీడియాలో వస్తూనే ఉంటుంది. అయితే అలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు కంపెనీలు ఒక థర్డ్‌పార్టీ సేఫ్టీ ఏజెన్సీని నియమించుకుంటాయి.

అవి కంపెనీలోని రక్షణ లోపాలను పరిశీలించి, నివేదిక ఇస్తుంటాయి. పెద్ద కంపెనీలకయితే కనీసం ముగ్గురు ఉద్యోగులు రావలసి ఉంటుంది. వారికి విజిటింగ్ ఫీజు, తిండి, వసతి సౌకర్యాలన్నీ సదరు ఏజెన్సీనే చూసుకోవలసి ఉంటుంది. అందువల్ల ఏజెన్సీలు కంపెనీల నుంచి 2 లక్షల వరకూ ఫీజు వసూలు చేస్తుంటాయి. ఈవిధంగా రాష్ట్రంలో ఒక అరడజనుకు పైగా సేఫ్టీ ఏజెన్సీలుంటాయి. అదే శాఖలోని ఫ్యాక్టరీస్ విభాగా నికి చెందిన ఓ కీలక అధికారి తమ్ముడికి సైతం ఒక ఏజెన్సీ ఉంది. అది ఫ్యాక్టరీ విజిట్‌కు వెళితే 5 లక్షలకు తక్కువ వసూలు చేయదన్న ప్రచారం ఉంది. కారణం అన్నగారు వడ్డించే స్థానంలో కూర్చోవడమేనట. చిన్న-మధ్య తరహా ఫ్యాక్టరీ యాజమాన్యాలు కూడా ఆ భయంతోనే, సదరు అధికారి తమ్ముడిగారి ఏజెన్సీకే ఇస్తాయట. అయితే పెద్ద కంపెనీలు మాత్రం 2 లక్షలు లోపు ఫీజు తీసుకునే ఏజెన్సీకే

మిగతా.. 2లో

### శెట్టిబలిజల్లోనూ తిరుగుబాటు

కాగా మంత్రి గారికి ఏ కులం చూసయితే మంత్రి పదవి ఇచ్చారో, ఆ కులంలోనే ఆయనపై తిరుగుబాటుకు తెరలేవడం విస్మయపరుస్తోంది. కుల తాలూకా కుల సంఘం నిర్వహించిన వనభోజనాలకు సైతం మంత్రిని ఆహ్వానించకపోవడం చర్చనీయాంశమయింది. మంత్రి గారు స్థానికేతరుడయినప్పటికీ.. కులాభిమానంతో గెలిపించుకున్న శెట్టిబలిజ నాయకులే, ఇప్పుడు మంత్రికి దూరంగా ఉండటంపై విస్మయం వ్యక్తమవుతోంది.

నిజానికి బలమైన సంస్థగా పేరున్న శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్‌ఏఎఫ్)ను 2019లో మేడిశెట్టి ఇస్రాయేల్ శ్రీనివాస్ అనే వ్యక్తి స్థాపించారట. దానితోపాటు స్థానిక శెట్టిబలిజ తాలూకా సంఘం రెండూ పవర్‌ఫుల్ సంస్థలని, ఏ అభ్యర్థులకయినా వారి మద్దతు లేకపోతే గెలవడం కష్టమన్న ప్రచారం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రిగారు 2022లో దానికి మద్దతునిచ్చారని చెబుతున్నారు. అయితే మంత్రిగారిని ఎన్నికల ముందు ప్రోత్సహిస్తే.. చివరకు ఎస్‌ఏఎఫ్‌ను సొంతం చేసుకుని, కులంలో హీరో అయ్యారంటున్నారు.

మిగతా.. 2లో

- తన మాట వినని బాబాయ్ సుబ్బారెడ్డికి జగన్ షాక్
- పరుచూరు ఇన్చార్జిగా ఎట్టకేలకు గాదె మధుసూదన్‌రెడ్డి నియామకం
- తొలుత గాదె మధుసూదన్‌రెడ్డికి ఇన్చార్జి ఇవ్వాలని జగన్ ఆదేశం
- దానితో జగన్‌ను మభ్యపెట్టి బాలాజీని ఇన్చార్జిగా చక్రం తిప్పిన వైవి సుబ్బారెడ్డి
- అమెరికా నుంచి బాలాజీని హుటాహుటిన పిలిపించిన సుబ్బారెడ్డి
- బాబాయ్ మాటలు నమ్మి మండల కమిటీలు వేయమని బాలాజీని ఆదేశించిన జగన్
- జగన్ ఆదేశాలు బేఖాతరు చేసి అమెరికాకు చెక్కేసిన బాలాజీ
- దానితో జగన్‌కు సొంత పార్టీలో పట్టులేదన్న ప్రచారం
- కోటరీ చేతిలో జగన్ బందీ అంటూ విమర్శలు
- దిద్దుబాటుకు దిగి గాదెకు ఇన్చార్జి ఇస్తున్నట్లు ప్రకటన
- సంచలనం సృష్టించిన 'మహానాడు' కథనం
- 'జగన్‌కు సుబ్బారెడ్డి ఝులక్' పేరుతో 'మహానాడు'లో వార్తా కథనం
- దానితో హడావిడిగా గాదెకు ఇన్చార్జి ఇస్తున్నట్లు ప్రకటన

# బాబాయ్‌కు అబ్బాయ్ ఝలక్

(సుబ్బు)



మహానాడు

జగన్‌కు సుబ్బారెడ్డి ఝులక్

'వైసీపీలో తనకూ పట్టు ఉందని'.. ఆ పార్టీ అధినేత జగన్ ఎట్టకేలకూ నిరూపించుకున్నారు. తాను కోటరీ చేతిలో బందీ కాదని, కోటరీ పంజరంలో చిలకను కాదని చాటుకునేందుకు, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరుచూరు నియోజకవర్గం పార్టీ ఇన్చార్జిని, 'తాను చెప్పిన నాయకుడికే' ఇచ్చి.. 'పార్టీలో తాను చెప్పింది కూడా జరుగుతుంద'న్న సంకేతాలు పంపించిన వైనం ఇది.

జగన్‌కు సొంత పార్టీపై పట్టులేదంటూ.. పరుచూరు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి నియామక వ్యవహారంలో ఎదురైన భంగపాటును, 'మహానాడు' సవివరంగా వెల్లడించిన వైనం, ఆ పార్టీని ఉలిక్కిపడేలా చేసింది.

మిగతా.. 3లో



## 1995 నాటి ముఖ్యమంత్రిని మీరు మళ్లీ చూస్తారు

- 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు చారిత్రక విజయం ఇచ్చారు
- సూపర్-6 హామీలు కచ్చితంగా అమలు చేస్తాం
- ఐదేళ్ల పాటు గత పాలకులు అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారు
- గత ప్రభుత్వ పాలన నేరాలు, ఘోరాలకు అడ్రస్‌గా మారింది
- ఎన్నో చిక్కుముడులు ఉన్నాయి..ఒక్కోటి విప్పుకుంటూ అభివృద్ధితో ముందువెళ్తున్నాం
- మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి,మహానాడు:** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. 'జగన్ రెడ్డి ఐదేళ్ల ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఎంతో భరోసా కలిగింది. జగన్ అరాచక విధానాలతో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారు. అమరావతి, పోలవరం, ఇతర సాగునీటి ప్రాజెక్టులను సమస్యల వలయంలో నెట్టివెళ్లాడు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు సార్లకుపైగా ఢిల్లీ వెళ్లి కేంద్రం నుంచి నిధులు తేవడంతో పాటు సాంకేతిక పరమైన సమస్యలను పరిష్కరించుకున్నాం. ఉన్మాదంతో సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిని కట్టడి చేస్తున్నాం. సమస్యల సుడిగుండంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించేందుకు ఒక్కో చిక్కుముడిని విప్పుకుంటూ ముందుకు వెళ్తున్నాం.

జగన్ రెడ్డి ప్రభుత్వ తప్పిదాలు రాష్ట్ర ప్రజలకు శాపాలుగా మారాయి. వాటిని సరిచేసేందుకు ఈ ఆరు నెలల పాటు కసరత్తు చేశాం. గత ఐదేళ్ల పాలన నేరాలు ఘోరాలకు అడ్రస్‌గా మారింది. కూటమి ప్రభుత్వం రాగానే శాంతి భద్రతలను సక్రమంగా అమలు చేస్తూ

మిగతా.. 2లో

## మనమంతా ఒక టీం..

# కలిసి పనిచేద్దాం

- ప్రజల జీవితాలు మారుద్దాం!
- పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణల అమలు
- మార్పు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతికత జోడిస్తే శాఖల్లో అద్భుత ఫలితాలు
- సచివాలయంలో వివిధ శాఖల ముఖ్యకార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు
- కొత్త సంవత్సరం సందర్భంగా అధికారులతో మాటా మంతీ.. పాజిటివ్ ఎనర్జీతో పనిచేద్దాం అని పిలుపు
- తన ఆలోచనలు, ప్రాధాన్యతలు, లక్ష్యాలు వివరించిన సిఎం... అధికారుల అభిప్రాయల స్వీకరణ
- కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అంటూ అధికారులను ప్రోత్సహించిన సిఎం చంద్రబాబు



**అమరావతి,మహానాడు:** రాష్ట్ర ప్రభుత్వంలోని ఆయా శాఖల్లోని కీలక అధికారులతో సిఎం చంద్రబాబు నాయుడు కొత్త సంవత్సరం సందర్భంగా కొద్ది సేపు ముచ్చటించారు. రోజువారీ సమీక్షలకు భిన్నంగా.... అధికారులతో కొత్త సంవత్సరం సందర్భంగా మాటామంతీ

మిగతా.. 3లో



03

దావోస్ సదస్సుకు హాజరు కానున్న సీఎం చంద్రబాబు, నారా లోకేశ్



03

ప్రభుత్వ, ప్రైవేట్ రంగ వైద్య సేవల్లో లోపాలను తొలగించాలి



05

రేవంత్ మనసులో 'దిల్' ఖుషీ

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 02, జనవరి 2025

## అంతా అమలాపురం
# వాసనలేనట!

కులసమీకరణల నేపథ్యంలో సొంత నియోజకవర్గం నుంచి, ఇక్కడికి వచ్చి ఎమ్మెల్యే-మంత్రి అయినప్పటికీ.. గెలిచిన నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేస్తున్న తమ్ముళ్లను పట్టించుకునే దిక్కులేదట. అమలాపురంలో ఆయన సొంత అనుచరులు, వైసీపీలకే గెలిచిన నియోజకవర్గంలోనూ పనులవుతున్నాయన్న ప్రచారం ఉంది. పెదలంకలోని ఇసుక ర్యాంపు నుంచి జనరిక్ షాపు, తిరుమల లెటర్లు అన్నీ అమలాపురంలోని తన అనుచరులకే ధారాదత్తం చేయడంపై గెలిచిన నియోజకవర్గంలోని తమ్ముళ్లు అగ్గిరాముళ్లలవుతున్నారట. ఎవరైనా పనుల కోసం వెళితే 'నాన్నగారిని కలిశారా' అని, మరికొన్ని పనుల కోసం వెళితే 'బావగారిని కలిశారా' అని అంటున్న వైనంపై సోషల్‌మీడియాలో.. 'నాన్నగారిని కలిశారా' అంటూ సెటైర్లు పేలుస్తున్నారు.



# సకుటుంబ..సపరివార..స'మేత'ంగా!

(మొదటిపేజీ తరువాయి..)

ఇస్తుండటం, తనకు పోటీ రావడం సహించలేని రాజుగారు.. తన అన్న గారికి చెప్పి, ఆ 2 లక్షలఫీజు తీసుకునే ఏజెన్సీపై మంత్రిగారికి చాడీలు చెప్పించారట. అతగాడు 5 లక్షలు ఫీజు తీసుకుంటున్నాడు కాబట్టి, పిలిచి 'మాట్లాడుకోమ'ని అన్నగారు మంత్రి-ఆయన బావకు సలహా ఇచ్చారట. పైగా ఆ ఏజెన్సీ వైసీపీ వాళ్లకు సంబంధించినదంటూ మసాలా దట్టించారట. దానితో రంగంలోకి దిగిన మంత్రి బావగారు ఆ ఏజెన్సీని పిలిచి, మా సంగతేమిటని పేషీలోనే బేరానికి దిగారు. అంత ఇచ్చుకోలేనని, తన ఏజెన్సీకి అంత తాహతు లేదని ఏజెన్సీ యజమానికి చేతులెత్తేశారట. పోనీ కంపెనీల వాళ్లతో మాట్లాడి తమ సంగతి చూసుకోమని చెప్పారట. అయితే తానెవరితోనూ మాట్లాడనని ఖరాఖండీగా చెప్పారు. ఆ విషయాన్ని బావగారు బావమరిదికి చేరవేశారట. అందుకు ఆగ్రహించిన మంత్రి.. విశాఖలో స్వయంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో.. ఏకంగా సదరు ఏజెన్సీపై వైసీపీ వారి పెత్తనం ఇక సాగదని, ఏజెన్సీల ఆటకట్టిస్తానని హెచ్చరించారు. వారికి ఎవరూ ఆ ఏజెన్సీకి వర్కులివ్వవద్దని పేరు చెప్పి మరీ ఆదేశించారట.

ఒక మంత్రి స్థాయి వ్యక్తి, చిన్న ఏజెన్సీ గురించి ప్రెస్‌మీట్‌లో మాట్లాడటం పరిశ్రమల యజమానులను విస్మయపరిచింది. ఇక అప్పటినుంచి ఆ పరిశ్రమల యజమానులు మంత్రికి భయపడి, వర్కులివ్వడం మానేశారట. ఈవిధంగా నష్టపోతున్న వారిలో కమ్మ సామాజికవర్గానికి చెందిన వారే ఎక్కువగా ఉండటం విశేషం.

టీడీపీ ప్రభుత్వంలో నిశ్చింతగా వ్యాపారం చేసుకోవచ్చని ఆశపడ్డ కమ్మ వ్యాపారులకు.. ఇప్పటి పరిస్థితి గత ప్రభుత్వమే బాగుందనిపించేలా ఉందట. ఇప్పుడు కోస్తాలో క్షత్రియ వర్గానికి చెందిన ఏజెన్సీలు, రాయలసీమలో రెడ్ల ఏజెన్సీలకు అధికారులే సిఫార్సు చేస్తుండగా.. తాము మాత్రం ఎటూ కాకుండా పోయామని కమ్మ వర్గానికి చెందిన ఏజెన్సీలు బావురుమంటున్నాయి.

దానితో గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు విరాళమిచ్చిన సదరు ఏజెన్సీ యజమాని, ఈ విషయాన్ని తన నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకు చెప్పి భోరుమన్నారట. దానికి స్పందించిన నక్కా సదరు మంత్రిగారికి ఫోన్ చేసి, ఆ ఏజెన్సీ యజమాని పార్టీ సానుభూతిపరుడేనని చెప్పడంతో, తనను వచ్చి కలవమని మంత్రి బదులిచ్చారట. మంత్రిగారి వద్దకు వెళ్లిన ఆ ఏజెన్సీ యజమానిని.. నువ్వు ఎమ్మెల్యే దగ్గరికిపోతే విడిచిపెడతానా? అని తాను చెప్పిన రేటు ఇవ్వాలని స్పష్టం చేశారట. దానితో దిక్కుతోచని సదరు ఏజన్సీ యజమాని తన వ్యాపారం మూసుకున్నట్లు తెలుస్తోంది.

ఈవిధంగా మంత్రి, ఫ్యాక్టరీస్ విభాగంలోని కీలక అధికారి బాధితులు కొద్దిరోజుల క్రితం మంత్రి లోకేష్ దగ్గరకు వెళ్లి, తమ బాధలు వెళ్లబోసుకున్నారట. ఆ ఫిర్యాదును తీసుకున్న లోకేష్ ఆఫీసు సిబ్బంది.. దానిని సహజంగానే సంబంధిత శాఖ అధికారి అయిన ఫ్యాక్టరీస్ హెడ్‌కే పంపించారట.


అంటే ఎవరి నుంచయితే ఇబ్బందులు పడుతున్నారో, అదే అధికారి దగ్గరకు ఫిర్యాదు కాపీ పంపించారన్నమాట. అన్నట్లు త్వరలో రిటైరవనున్న సదరు ఫ్యాక్టరీస్ కీలక అధికారి, తన తమ్ముడు నిర్వహించిన ఏజెన్సీ వ్యాపారంలో దిగబోతున్నారట. దానికంటే ముందు ఓ రాజుల కంపెనీకి సేఫ్టీ అడ్వైజర్‌గా ఉండేందుకు ఒప్పందం కుదిరిందంటున్నారు. అదీ సంగతి!

ఇక ఫార్మా, కెమికల్ కంపెనీల్లో పేలుళ్లు జరిగిన వెంటనే రంగంలోకి దిగిపోతున్న 'బావగారు', కంపెనీవారితో బేరాలాడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఈ వ్యవహారంలో ఫ్యాక్టరీస్ విభాగంలోని ఉన్నతాధికారి తమ్ముడు, పరిశ్రమల యజమానులతో బేరాలకు దిగి, వ్యవహారం సెటిల్ చేస్తున్నట్లు ఆ శాఖలో బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

తాజాగా పరవాడలోని ఓ ఫార్మా కంపెనీలో విషవాయు లీకయి ఇద్దరు కార్మికులు చనిపోయారు. కంపెనీ యాజమాన్యం వారికి 40 లక్షల చొప్పున నష్టపరిహారం అందించింది. దీనిని అనువుగా చేసుకున్న 'బావగారు' సదరు పరిశ్రమ యజమానికి దాదాపు 2 కోట్లు ఇవ్వాలని బేరం పెట్టారట. అందుకు ఆయన అంగీకరించకపోవడంతో, శాఖాధికారులు ఆ పరిశ్రమకు క్లోజింగ్ ఆర్డర్ ఇచ్చారు. అయితే తాజాగా మళ్లీ దానిని రిఓక్ చేస్తూ ఉత్తర్వులిచ్చారంటే, తెరవెనుక ఏం జరిగిందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.

అదేవిధంగా జగ్గయ్యపేటలోని ఓ జాతీయ స్థాయి సిమెంట్ ప్లాంట్‌లో పేలుడు జరిగి ఇద్దరు చనిపోగా, చాలామందికి గాయాలయ్యాయి. ఆ కంపెనీ ప్రతినిధిని పిలిపించిన బావగారు బేరం పెట్టారట. అందుకు ఒప్పుకోని ఆ మల్టీనేషన్ కంపెనీ.. దీనిని సీఎంఓ దృష్టికి తీసుకువెళ్లగా, భయంతో వారిని వదిలేశారట. కానీ అచ్యుతాపురం ఎస్ఈజడ్ లోని ఓ కెమికల్స్‌లో, పేలుడు జరిగి ఒకరు మరణించిన ఘటనను మాత్రం సొమ్ము చేసుకున్నారట.

'మంత్రిగారి బావతో మాట్లాడుకోండి. లేకపోతే వ్యవహారం సీరియస్ అవుతుంద'ని స్థానిక అధికారులు బెదిరించడంతో.. రంగంలోకి దిగిన ఆ కంపెనీ యజమాని, తన మిత్రుడైన కైకలూరు ప్రజాప్రతినిధికి విషయం చెప్పారట. దానితో మంత్రికి ఫోన్ చేసిన కైకలూరు ప్రజాప్రతినిధి.. ఫలానా కంపెనీ తన మిత్రుడిదేనని, అతను వచ్చి కలుస్తాడని చెప్పడం, ఆయన సరే రమ్మని సమయం ఇవ్వడం, బావగారు రంగంలోకి దిగి వ్యవహారం సెటిల్ చేయడం చకాచకా జరిగిపోయాయట. విచిత్రమేమిటంటే.. పేలుళ్లు, విషవాయువు లీకయి కార్మికులు మృతి చెందిన సందర్భంలో ఫ్యాక్టరీని క్లోజ్ చేయించి, హడావిడి చేసే అధికారులు మళ్లీ కొద్దిరోజులకే వాటిని ఎలా తెరిపిస్తున్నారు? ఎందుకు తెరిపిస్తున్నారని ఆలోచిస్తే, దానికి కారణం.. 'మామూలే' కాగా ఇటీవలే ప్రజాప్రతినిధి అవతారమెత్తిన కాకినాడ యువనేతతో కలసి.. బావగారు విశాఖ వేదికగా ఈ దందాలను 'సాన'బెడుతున్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది. ఆ మేరకు ఆ యువ ప్రతినిధి తన మేనేజర్‌గా విశాఖలో ఒకరిని నియమించారని.. బావగారు-ఆ మేనేజర్ కలసిమెలసి ఫ్యాక్టరీలను పిండేపనిలో ఉన్నారన్నది పారిశ్రామిక వర్గాల్లో వినిపిస్తున్న ముచ్చట. నిజం నారాయణుడికెరుక?


Dodda Manideep అను వారు 2024 జనరల్ ఎలక్షన్స్ నందు Y.S.R.C.P తరపున కాంపైన్ లో పాల్గొన్నారని C-Vigil నందు Complaint నమోదైనందున Special Officer వారు ఈ కార్యాలయము నకు Enquiry నిమిత్తం వచ్చి వారిని విధుల నుండి తొలగించినట్లుగా నా వద్ద Statement తీసుకున్నందున, వారిని ఈ దేవస్థాన విధుల నుండి తగ్గించడమైనది.

కార్యనిర్వహణాధికారి
శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానం
ద్రాక్షారామ - 533 262






## ద్రాక్షారామం గుడిలో
# ఫ్యామిలీదే పెత్తనం

సుప్రసిద్ధ ద్రాక్షారామంలో గత ఎన్నికల సమయంలో దొడ్డా మణిదీప్ అనే ఉద్యోగి వైసీపీ అభ్యర్థి విజయం కోసం ప్రచారంలో పాల్గొన్నారట. టీడీపీ కార్యకర్తలు దానిని ఫొటోలు తీసి ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. ఆయన దానిని పరిశీలించి సదరు ఉద్యోగిని విధుల నుంచి తప్పిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. అయితే మంత్రి గారి ఫ్యామిలీని 'తృప్తి' పరిచిన సదరు సస్పెండైన ఉద్యోగి, మళ్లీ అదే ఆలయంలో నిక్షేపంగా ఉద్యోగం చేసుకుంటున్న ఫొటోలు, ఇటీవల సోషల్‌మీడియాలో ప్రత్యక్షమవడంపై టీడీపీ శ్రేణులు కస్సుమంటున్నాయి. వైసీపీ కోసం పనిచేసిన ఉద్యోగిని మంత్రిగారి ఫ్యామిలీ, మళ్లీ ఎలా తీసుకుంటారని, ఎన్నికలకు 24 రోజుల ముందు పార్టీలో చేరిన మంత్రికి పార్టీపై ఇంతకన్నా ఇంకేమి చిత్తశుద్ధి ఉంటుందని విరుచుకుపడుతున్నారు. అసలు మంత్రి గారి చుట్టూ ఒక్క టీడీపీ కార్యకర్త ఉండరని, నియోజకవర్గంలో తమ పార్టీ అందరూ ఉన్న అనాథ అన్నది తమ్ముళ్ల ఆవేదన.

గత ఎన్నికల్లో మిగిలిన వారితో సమానంగా రాత్రి వరకూ ఎన్నికల ప్రచారం చేసిన, సొంత సామాజికవర్గానికి చెందిన మండల సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్యను, అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించటంపై పార్టీలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పోనీ జనసేనలో పనిచేసే కార్యకర్తలకు ఇచ్చినా బాగుండేదని, ఆ పార్టీ పేరు చెప్పుకుని తిరిగే వారికి పదవి ఇవ్వడంపై అటు జనసేనలోనూ ఆగ్రహం వ్యక్తమవుతోందట.


Medisetti Israyel Srinivas is with Pamarthi Jaya Prakash and 34 others.
4d ·

మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ గారు.. మీ విధానాన్ని మార్చుకోరా? రామచంద్రపురం నియోజవర్గంలో టిడిపి పార్టీని భూస్థాపితం చేయటమే మీ ధ్యేయమా? పార్టీ కోసం పనిచేసిన మండల సమాఖ్య అధ్యక్షరాలు వాసంశెట్టి లావణ్య గారు జాతి బిడ్డ మీ విజయం కోసం ఎంతో కసిగా రాత్రి 10 గంటల వరకు పార్టీ కోసం కష్టపడి ప్రచారం చేసిన సోదరిని అన్యాయంగా తీసివేసి జనసేన పార్టీలో కూడా ఏమాత్రం పనిచేయని ఎలుగుబంటలు సూర్యకుమారి గారిని నియమించడం ఎంతవరకు సబబు? ఒకవేళ ఎవరికైనా పోస్టులు ఇవ్వాలి అనుకుంటే పార్టీ దగ్గర నుంచి తెచ్చి మీ దమ్ము నిరూపించుకోండి ఉన్న వారిని తీసివేసి టిడిపి పార్టీని నాశనం చేయొద్దు🙏 డబ్బా బ్యాచ్ కి చెప్తున్నా ఇలాంటివి ఇంకా ఎన్నో ఉన్నాయి జాతిని, తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేసే వరకు నిద్రపోయేలా లేడు నా మిత్రుడు ఇప్పటికైనా మేల్కొండి 🔥🔥 Nara Lokesh Tdp

## శెట్టిబలిజల్లోనూ తిరుగుబాటు

(మొదటిపేజీ తరువాయి..)

"కుల పెద్దలయిన ఇతర ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుని, వారిని గౌరవించాలని చెప్పినా వినకుండా, ఎమ్మెల్యే అయిన తర్వాత చివరకు సొంత కులం అధికారులనే తొలగించిన మంత్రికి మేం మద్దతు ఇవ్వడం మానేశాం. పైగా నియోజకవర్గంలో ఆయన అనుచరులు చేస్తున్న దందాలు పార్టీని భ్రష్టుపట్టిస్తున్నాయి. దొంగల బ్యాచ్‌ను వెంటేసుకుని తిరుగుతున్నారు. ఇటీవల మంత్రి అనుచరులు 75 లారీలతో ఉన్న ఇసుకను తరిస్తుంటే పోలీసులు పట్టుకుంటే మంత్రి తనకు సంబంధం లేదన్నారు. కానీ అధికారులు ప్రెస్‌మీట్ పెట్టి మంత్రి అనుచరుల పేర్లు ప్రకటించారు. నేను ఇవన్నీ ఆయనకు ఎస్ఎంఎస్ ద్వారా పంపించా. స్వయంగా మాట్లాడి చెప్పి చూశా. కులపెద్దలతో చెప్పించాం. కానీ మార్పు లేదు. అందుకే మేం ఆయనను కుల సంఘం మీటింగులకు పిలవడం లేదు. ఇటీవల శెట్టిబలిజ తాలూకా సంఘం నిర్వహించిన వనభోజనాలకు మంత్రిని ఆహ్వానించలేదంటే సొంత కులంలో ఆయనకు స్థానికంగా ఎంత మద్దతు ఉందో మీరే అర్థం చేసుకోండి. అసలు ఎస్ఏఎఫ్ ఎవరిదో, దానిని ఇప్పటివరకూ ఎందుకు రిజిస్టర్ చేయలేదో అడగండి. ఇది ఎవరికో పుట్టిన బిడ్డను నా బిడ్డ అనడమే" అని రామచంద్రాపురం టీడీపీ నేత మేడిశెట్టి ఇస్రాయేల్ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

ఎన్నికల ముందు శెట్టిబలిజ యువకులను ఆకట్టుకునేందుకు, మంత్రి తాను కుల సంఘానికి కోటి రూపాయలు ఇస్తున్నానంటూ, ఆర్భాటంగా రాజకీయ కుల ప్రముఖుల సమక్షంలో డమ్మీ చెక్కు ఇచ్చారు. ఇప్పటికీ ఆ విరాళం ఇవ్వలేదని వెల్లడించారు. ఎస్ఏఎఫ్ పేరుతో వాట్సాప్ గ్రూపులు సృష్టించి, వాటి ద్వారా వచ్చిన విరాళాలకు లెక్కా పత్రం లేదన్నారు. ఇప్పటికీ దానికి కమిటీ లేదన్నారు. తాను సోషల్‌మీడియాలో చెప్పిన వన్నీ అక్షరసత్యాలని, కాకపోతే ప్రభుత్వం- పార్టీ ఇంటలిజన్స్‌తో విచారణ చేయించు కోవచ్చని స్పష్టం చేశారు.



మంత్రి వ్యవహారశైలిపై తాను సీఎం చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసిన మాట నిజమేనని, ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'నేను ఇదంతా పార్టీ మేలు కోసమే సీఎంగారికి ఫిర్యాదు చేశా. మంత్రి వైసీపీ నుంచి టీడీపీలో చేరినప్పుడు ఆయనతో ఒక్క కౌన్సిలర్ కూడా చేరలేదు. అదే నా వెంట ఎంతమంది సర్పంచులు, స్థానిక నేతలు చేరారో చూసుకోండి. ఇక్కడ మేం లోకల్. శెట్టిబలిజ సంఘాన్ని మేమంతా కంటికి రెప్పలా కాపాడుకుంటాం. దానికోసం నష్టపోయినా దానికి సిద్ధంగానే ఉంటాం. కులపెద్దలందరినీ గౌరవిస్తాం. అలాగే ఎమ్మెల్యేలను కూడా కులపెద్దలను గౌరవించాలని చెబుతాం.

కానీ ఆయనకు మంత్రి పదవి వచ్చిన తర్వాత మా కులానికి చెందిన అధికారులకు లాభం కలగకపోగా, ఉన్నవారిని తీసేస్తుంటే కులంలో మాపై ఎంత ఒత్తిడి ఉంటుంది? మాకెంత అవమానంగా ఉంటుంది? ఆయన చుట్టూ ఎవరు ఉంటున్నారు? ఏ తరహా వ్యక్తులు ఉంటున్నారో మీరే చూస్తున్నారు. మీడియాలో రోజూ వస్తూనే ఉన్నాయి. అవన్నీ సీఎం గారికి ఫిర్యాదు చేశాం. ఆయనకు ఎవరెవరి మద్దతో ఉందంటున్నారు. అయినా మేం భయపడం. మేం పార్టీ కోసం, కులం కోసం పనిచేసేవాళ్లం" అని ఇస్రాయేలు శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## 'ఫ్యామిలీ ప్యాకేజీ'లో మరికొన్ని ముచ్చట్లు

- బావగారు జిల్లాల్లోని డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్లకు ఫోన్ చేసి, పరిశ్రమలకు సంబంధించిన అన్ని పనులను నరసింహరాజు ద్వారా చేయించుకోవాలని, ఫోన్ల ద్వారా ఆదేశిస్తున్నట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.
- మంత్రిగారి ఇలాకాలో వైసీపీ సర్కారులో ఫుడ్ కమిషన్ మెంబరుగా ఉన్న వైసీపీ నేత కు రెండు వైన్‌షాపులు దక్కాయట.
- శేఖర్ అనే వ్యక్తి ఇసుక, మద్యం వ్యవహారంలో చక్రం తిప్పుతున్నట్లు పార్టీ వర్గాలలో ప్రచారం జరుగుతోంది.
- తాజాగా సర్పవరం పోలీసుస్టేషన్‌లో ఒక మహిళను భయపెట్టి ఖాళీ చెక్కులపై సంతకం చేయించుకున్న ఫిర్యాదుపై, మంత్రి అనుచరులపై కేసు నమూదు చేశారు.
- సొంత శాఖలో అయినా, నియోజకవర్గంలో అయినా.. తాను చెప్పిన మాట వినని అధికారులు-ఏజెన్సీలు-వ్యక్తులపై, వైసీపీ ముద్ర వేసి తాను కోరుకున్న వారిని తెచ్చుకుంటున్నారని తమ్ముళ్లు చెబుతున్నారు.
- అనుమతులు లేని ఆక్వా చెరువుల తవ్వకాలకు సంబంధించి రైతులు గత వైసీపీ సర్కారులో ఫార్మాలిటీస్ ఇచ్చారు కాబట్టి.. తమకూ ఫార్మాలిటీస్ ఇవ్వాలన్న మంత్రి గారి వీడియోను, ఎంపి పిల్లి సుభాష్‌చంద్రబోస్ విడుదల చేసిన వైనం.. పార్టీని అప్రతిష్ఠపాలు చేసిందని కార్యకర్తలు విరుచుకుపడుతున్నారు.

## 1995 నాటి ముఖ్యమంత్రిని
# మీరు మళ్లీ చూస్తారు

(మొదటిపేజీ తరువాయి..)

నేరాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

### గత పాలనంతా విధ్వంసం...మేము రిపేర్లు చేస్తూ వెళ్తున్నాం

'మా ప్రభుత్వానికి కొన్ని ప్రాధాన్యతలు ఉన్నాయి. అందుకు అనుగుణంగానే మేం పాలన సాగిస్తున్నాం. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చరిత్రాత్మక విజయం సాధించింది. రాష్ట్రంలో ప్రజానికంతో పాటు వివిధ పార్టీల నాయకులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మేము వచ్చాక ఆరు నెలల్లో ప్రజలకు ఒక నమ్మకం కలిగింది. వారి భవిష్యత్‌పై నమ్మకం కలిగేలా మేం పనిచేస్తున్నాం. ధ్వంసమైన వ్యవస్థలను రిపేర్ చేసుకుంటూ వేళ్తూ ప్రజల ఆశలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నాం.



పోలవరం ప్రాజెక్ట్, అమరావతి నిర్మాణానికి జగన్ అనేక చిక్కుముడులు వేశాడు. వాటిని విడదీస్తూ అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నాం. పోలవరం ప్రాజెక్టుకు టెక్నికల్ కమిటీ ఫిజుబిలిటీ రిపోర్ట్ ఇచ్చింది. కేంద్రం నుంచి నిధులు రాబట్టి త్వరలో పోలవరం ప్రాజెక్ట్ పనులు ప్రాంభించి అనుకున్న సమయానికే పూర్తి చేస్తాం. ప్రజలు కూటమి ప్రభుత్వంపై చాలా నమ్మకం పెట్టుకున్నారు. ఆ నమ్మకానికి అనుగుణంగా పని చేస్తాం. నేను ఎప్పుడూ రాజకీయ కక్షలు తీర్చుకోను...తప్పు చేసిన వారిని మాత్రం వదిలేది ప్రసక్తి లేదు. ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందే' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

### 1995 నాటి ముఖ్యమంత్రిని మీరు మళ్లీ చూస్తారు

'1995లో సీఎంగా నా పనితీరు చూశారు. ఇక ముందుకు కూడా ఆనాటి సీఎంను చూస్తారు. సోషల్ మీడియాలో ఇదివరకు లాగా ఇష్టమొచ్చినట్టు అసభ్యకరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయి. సెకీ ఒప్పందం మాకు లడ్డూలా దొరికిన విషయం వాస్తవమే. చట్టం ప్రకారామే ముందుకు వెళ్తాం. రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. 2004లో నన్ను ఎవరూ ఓడించలేదు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేశా. నేను చేసిన అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయాం.

ఈ సారి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ... ప్రజలను నాతోపాటే తీసుకెళ్తాను. ఆరు నెలలల్లో వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఇన్ని వేల కోట్లు పెట్టుబడులు రాలేదన్నారు. ఇచ్చిన హామీలైన సీపీఎస్ రద్దు, మద్య నిషేధం అమలు చేస్తామని అబద్ధాలు చెప్పాడు. అధికారంలోకి వచ్చాక నాకు తెలియదు, ఇంత ఖర్చు అవుతుందని అనుకోలేదు అంటూ మాట మార్చారు. ఎంతమంది ఉన్నా అమ్మఒడి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. మేము మాత్రం ఇచ్చిన సూపర్ 6 హామీలను కచ్చితంగా అమలు చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ గన్నవరం విమానాశ్రయంలో ఈ రోజు రాత్రి కలుసుకున్నప్పుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 02, జనవరి 2025

డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,85,450

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1 న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్

మార్తి సుబ్రమణ్యం

సంపాదక సారధ్యంలో





బోడపూడి సుబ్బారావు (BSR)

సారధ్యంలో



3
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 02, జనవరి 2025

## దావోస్ సదస్సుకు హాజరు కానున్న
# సీఎం చంద్రబాబు, నారా లోకేశ్

- దావోస్‌లో జనవరి 20 నుంచి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు
- ఈ నెల 19న దావోస్ బయల్దేరనున్న చంద్రబాబు బృందం
- 'షేపింగ్ ద ఇంటెలిజెంట్ ఏజ్' థీమ్‌తో దావోస్‌లో ఏపీ బృందం ప్రదర్శన



**విజయవాడ:** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రతి ఏడాది ప్రపంచ ఆర్థిక వాణిజ్య సదస్సు నిర్వహిస్తుండడం తెలిసిందే. 2025లో జనవరి 20 నుంచి 24 వరకు దావోస్ సదస్సు జరగనుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ఏపీ సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ఈ సదస్సులో పాల్గొన నున్నారు.

ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ సంస్థలకు వివరించేందుకు దావోస్ వేదికను ఉపయోగించు కోవాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇందుకోసం 'షేపింగ్ ద ఇంటెలిజెంట్ ఏజ్' థీమ్ తో ఏపీ బృందం దావోస్‌లో ప్రదర్శన ఏర్పాటు చేయనుంది. దావోస్ పర్యటన కోసం చంద్రబాబు బృందం ఈ నెల 19న రాష్ట్రం నుంచి బయల్దేరనుంది. సీఎం వెంట పరిశ్రమలు, ఏపీ ఆర్థికాభివృద్ధి బోర్డు అధికారులు కూడా దావోస్ పర్యటనకు వెళ్లనున్నారు.

ఈ సదస్సులో పాల్గొనే దిగ్గజ పారిశ్రామిక సంస్థలకు ఏపీలో అందుబాటులో ఉన్న వనరులు, పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ వివరించనున్నారు.

ఏపీలో టెక్నికల్ అడ్మినిస్ట్రేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ తదితర అంశాలపై వివరించనున్నారు. రాష్ట్రంలో స్మార్ట్ సిటీలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులకు పరిచయం చేయనున్నారు.




## ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో
# నూతన సంవత్సర వేడుక

**ఒంగోలు:** ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 2025 నూతన సంవత్సర వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ ఆనందకర సందర్భానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ని పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లా డుతూ, 2025లో పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ రాజ్ ఉద్యోగులు, టీచర్ సంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటి సభ్యులు, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్-యూనిట్-బూతు ఇంచార్జ్‌లు, మరియు వివిధ అను బంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు కూటమి నాయ కులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐరాస భద్రతా మండలిలో పాకిస్థాన్‌కు చోటు

- జపాన్ ఉన్న స్థానంలో పాకిస్థాన్‌కు చోటు
- డెన్మార్క్, గ్రీస్, పనామా, సోమాలియా కూడా




**మహానాడు:** ఐక్యరాజ్యసమితిలో అత్యంత కీలకమైన భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా పాకిస్థాన్‌కు అవకాశం లభించింది. బుధవారం నుంచి 2026 డిసెంబరు వరకు దాదాపు రెండేళ్ల పాటు తాత్కాలిక సభ్యదేశంగా పాక్ కొనసాగనుంది. సెక్యూరిటీ కౌన్సిల్‌లో ఇప్పటివరకు జపాన్ ఉన్న స్థానంలో పాకిస్థాన్‌కు చోటు దక్కింది. భద్రతా మండలిలో కొత్తగా అవకాశాన్ని దక్కించుకున్న ఇతర దేశాల జాబితాలో డెన్మార్క్, గ్రీస్, పనామా, సోమాలియా కూడా ఉన్నాయి.

# బాబాయ్‌కు అబ్బాయ్ ఝలక్

(మొదటిపేజీ తరువాయి..)

ఆ పార్టీ జిల్లా నేత గాదె మధుసూదన్‌రెడ్డి విషయంలో 'రెండోసారి అమలుకాని' జగన్ ఆదేశంపై, మహానాడు రాసిన కథనంతో జగన్ దిద్దుబాటుకు దిగారు.

చివరాఖరకు అదే గాదె మధుసూదన్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్చార్జిగా ప్రకటించి, మూడురోజుల క్రిత ం తనకు ఝలక్ ఇచ్చిన బాబాయ్ వైవి సుబ్బారెడ్డికి, ఇప్పుడు అబ్బాయ్ ఝలక్ ఇవ్వడం ప్రకాశం జిల్లా పార్టీ వర్గాలను నివ్వెరపరిచింది. ఫలితంగా ఇప్పుడు బాబాయ్ సుబ్బారెడ్డికి అబ్బాయ్ దగ్గర పలుకుబడి లేదని తేలిపోయింది. అంటే తనకు బాబాయ్ ఝలక్ ఇస్తే.. ఇప్పుడు అబ్బాయ్ బాబాయ్‌కి ఝలక్ ఇచ్చారన్నమాట.


Yuvajana Sramika Rythu Congress Party
పత్రికా ప్రకటన
పార్టీ అధ్యక్షులు శ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, శ్రీ గాదె మధుసూదన్ రెడ్డి గారిని "పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త"గా నియమించడమైనది.
- పార్టీ కేంద్ర కార్యాలయం

తన సొంత జిల్లాలో పట్టుసాధించిన వైసీపీ ఎంపి వైవి సుబ్బారెడ్డి.. చివరకు అబ్బాయ్ జగన్‌కే ఝలక్ ఇచ్చి, తన మాట చెల్లుబాటయ్యేలా చూసు కున్నారు. దానికి కోటరీ సహకారం కూడా లేకపోలేదు. పరుచూరు నియోజకవర్గ ఇన్చార్జిగా, గతంలో శాసనసభకు పోటీ చేసి ఓడిపోయిన ఎడం బాలాజీని నియమించడంలో సుబ్బారెడ్డి-కోటరీ చక్రం తిప్పారు. నిజానికి మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు గాదె మధుసూదన్‌రెడ్డికి, నియోజకవర్గ ఇన్చార్జి ఇవ్వాలని స్వయంగా జగన్ ఆదేశించారు. ఎందుకంటే గాదె వెంకటరెడ్డి ఆ నియోజకవర్గానికి సుదీర్ఘకాలం మంత్రి, ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ కోణంలోనే జగనఇ ఆయన తనయుడికి ఇన్చార్జిగా ఎంపిక చేసినట్లు కనిపించింది.

దానితో అమెరికాలో ఉన్న బాలాజీని ఆగమేఘాలపై రప్పించి, కోటరీ సహకారంతో ఆయనకు నియోజకవర్గ ఇన్చార్జి ఇప్పించి, సుబ్బారెడ్డి ఆ నియోజకవర్గంపై తన పట్టు కొనసాగించారు. జిల్లాలో మరొక రెడ్డినేత తనకు పోటీ లేకుండా చూడటంలో, సుబ్బారెడ్డి అప్పటివరకూ సక్సెస్ అయ్యారు. నియోకవర్గంలో మండల కమిటీలు త్వరగా నియమించాలని, జగన్ ఇచ్చిన ఆదేశాలకు తలూపిన బాలాజీ.. తర్వాత అమెరికాకు చెక్కేయడంతో సుబ్బారెడ్డి ఇరుకునపడ్డారు. తన బదులు తన తమ్ముడు నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటాడని చల్లగా చెప్పారట.

దీనితో పార్టీలో జగన్‌కు ఏ మాత్రం పట్టులేదని, కోటరీతోపాటు సుబ్బారెడ్డిదే హవా అన్న ప్రచారం మొదలయింది. దానికి తగినట్లుగానే గతంలో గాదె మధుసూదన్ రెడ్డికి, జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలన్న జగన్ ఆదేశాలకు భిన్నంగా.. కోటరీ చక్రం తిప్పి, మాజీ మంత్రి నాగార్జునకు ఆ పదవి ఇచ్చింది. నిజానికి అప్పుడే జగన్‌కు పార్టీలో పట్టులేదని.. ఆయనను చూపించి కోటరీనే పెత్తనం చేస్తోందని.. జగన్ చెప్పిన వారికే దిక్కులేదన్న వ్యాఖ్యలు వినిపించాయి. మళ్లీ రెండోసారి అదే గాదె నియమాకంలో కూడా జగన్‌కు ఝలక్ ఇవ్వడంతో, జగన్‌కు ఏపార్టీలో పట్టులేదన్నది నిజమని తేలిపోయినట్లయింది.

వైసీపీలో జరుగుతున్న ఈ పరిణామాలపై 'మహానాడు'లో వెలువడిన కథనం, ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేపింది.

తనకు పార్టీపై పట్టులేదన్న వాస్తవం జనంలోకి, ప్రధానంగా కిందిస్థాయి కార్యకర్తలకు వెళితే ప్రమాదమని గ్రహించిన జగన్ దిద్దుబాటకు దిగారు. ఆ మేరకు పరుచూరు నియోజవర్గ ఇన్చార్జిగా గాదె మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు. సో.. కోటరీకే కాదు.. 'జగన్‌కు కూడా' పార్టీపై పట్టుందన్నమాట!

# ప్రభుత్వ, ప్రైవేట్ రంగ వైద్య సేవల్లో లోపాలను తొలగించాలి

- రెండు రంగాల్లో నెలకొన్న సమస్యల్ని క్రోడీకరించిన వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి
- సేవల నాణ్యతను మెరుగుపర్చడానికి వైద్య సిబ్బంది పునరంకితం కావాలన్న సత్యకుమార్ యాదవ్
- గత ఆరు నెలల అధ్యయనంతో ప్రభుత్వ వైద్య సేవల్ని మెరుగుపర్చడానికి ఆదేశాలు
- ఆరోగ్య, సౌభాగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణకు ప్రజారోగ్యం చాలా ముఖ్యం
- ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల వైద్య సిబ్బందికి నూతన సంవత్సర మొదటి రోజున మంత్రి బహిరంగ లేఖ



**అమరావతి:** నూతన సంవత్సర దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ వైద్యులు, వైద్య సిబ్బందిని ఉద్దేశించి బుధవారం నాడు బహిరంగ లేఖ రాసి వైద్య సేవల్లో ఎదురవుతున్న లోపాల్ని తక్షణమే తొలగించాల్సిన ఆవశ్యకతను నొక్కివక్కాణించారు. తన రెండు పేజీల బహిరంగ లేఖలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రులకు సంబంధించి ప్రజల మనసుల్లో నెలకొన్న ఆలోచనలు, ఆందోళలను వివరించి వాటిని పరిష్కారం చేయాలని సూచించారు.

నూతన సంవత్సర దినోత్సవం సందర్భంగా వైద్య సేవల నాణ్యతను పెంచి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల విడుదల చేసిన స్వర్ణ ఆంధ్రప్రదేశ్-2047 విజన్ డాక్యుమెంట్ మేరకు ఆరోగ్య, సంపన్న, ఆనంద ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణకు వైద్యులు, ఇతర సిబ్బంది పునరంకితం కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

ప్రభుత్వాసుపత్రులకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న అభిప్రాయలు, ఆందోళనలను వివరిస్తూ....రోగుల పట్ల వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో సహా ఇతర వైద్య సిబ్బంది వైఖరి, సకాలంలో రోగుల్ని పరిశీలించడం, నిర్దేశిత పనివేళల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండడం, స్పెషలిస్టు మరియు సీనియర్ వైద్యులు నిర్దేశించిన విధంగా ఓపీ, ఐపీ సేవల్ని అందించడం, రోగ నిర్ధారణ పరికరాల పనితీరు, ప్రైవేట్ పరీక్షా కేంద్రాలకు రోగుల్ని పంపడం, పరిశుభ్రత వంటి విషయాల్లో లోపాలున్నాయని మంత్రి వివరించారు. అయినా...ప్రభుత్వాసుపత్రుల్లో రోజు రోజుకీ పెరుగుతున్న ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్లు వాటి పట్ల ప్రజలకున్న నమ్మకాన్ని వెల్లడిస్తున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. మంత్రిగా బాధ్యతల్ని స్వీకరించినప్పటి నుంచి ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యల్ని పలు మార్లు సమీక్షించి వాటి పరిష్కారానికి స్పష్టమైన ఆదేశాలిచ్చామని మంత్రి తెలిపారు. గత ఆరు నెలలుగా రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వ్యవస్థీకృతం చేసిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ, క్రమానుగత సమీక్షలతో ప్రభుత్వ వైద్య సేవల్లో నాణ్యత మెరుగుపడటం పట్ల మంత్రి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు సంబంధించి...ఖర్చుతో కూడిన వైద్యం, రోగ నిర్ధారణ కోసం అనవసరమైన పరీక్షలు చేయించడం, రోగులతో వైద్యులు అతి తక్కువ సమయాన్ని గడపడం, నర్సింగ్ మరియు ఇతర సాంకేతిక సిబ్బందికి తక్కువ వేతనాల చెల్లింపు వంటి అంశాలు ప్రైవేట్ వైద్య రంగంలో నెలకొన్న వ్యాపార దృక్పధానికి అద్దం పడుతున్నాయని, ఈ అంశాలకు సంబంధించి ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు దృష్టి సారించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది రోగుల పట్ల సానుభూతి, సదవగాహన, ఆర్ద్రత, నిబద్ధతలతో వ్యవహరిస్తూ, వైద్యో నారాయణో హరి అన్న సూక్తికి అనుగుణంగా నడుచుకుంటూ సేవల నాణ్యతను పెంపొందించాల్సిన ఆవశ్యకతను ఆయన తన లేఖలో ఉద్ఘాటించారు.

# మనమంతా ఒక టీం.. కలిసి పనిచేద్దాం

(మొదటిపేజీ తరువాయి..)

జరిపారు. తన ఆలోచనలు, ప్రాధాన్యతలు, లక్ష్యాలు వివరించిన సిఎం.. అధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అంటూ అధికారులను ప్రోత్సహించారు. మనమంతా ఒక టీం.. కలిసి పనిచేద్దాం.. ప్రజల జీవితాలు మారుద్దాం అని వారికి సూచించారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మార్పు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతికత జోడిస్తే శాఖల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని అధికారులకు సిఎం ఉద్బోదించారు. సిఎస్, డీజీపీ, సిఎంవో అధికారులతో పాటు... వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముందుగా ఆయా అధికారులకు, వారి శాఖలో పనిచేసే ఉద్యోగులకు ముఖ్యమంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. ఒక పాజిటివ్ ఎనర్జీతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సిఎం అధికారులతో అన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాలసీలకు సంబంధించి తన అనుభవాలను ముఖ్యమంత్రి గుర్తుచేసి వారిని మోటివేట్ చేశారు. 2025 సంవత్సరం లక్ష్యాలు ఏంటి, పనితీరు ఎలా ఉండాలనేది వారికి వివరించి కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ప్రతి శాఖలో కూడా రిజల్ట్ ఓరియంటెడ్ గా పని జరగాలని సిఎం అభిప్రాయపడ్డారు.

సమావేశంలో సిఎం మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో సంస్కరణలు అంటే పేదలకు వ్యతిరేకం అనే ప్రచారం ఉండేది. కానీ నాడు ధైర్యంగా సంస్కరణలు అమలు చేశాం. వెనుకడుగువేయకుండా కొత్త పాలసీలు తీసుకువచ్చి అమలు చేశాం. సంస్కరణలు పేదలకు వ్యతిరేకం కాదు.. పేదల జీవితాలు మార్చేవి అని నాడు తీసుకున్న నిర్ణయాలు నిరూపించాయి. అందుకే పేదల జీవితాలను మార్చే సంస్కరణల అమలులో ఎప్పుడూ చొరవ చూపుతాను.

వాజ్ పేయి ప్రధాని గా ఉన్న సమయంలో రాష్ట్రంలో కూడా సంస్కరణలు మొదలుపెట్టాం. నేషనల్ హైవేల విషయంలో నాడు తీసుకున్న నిర్ణయంతో స్వర్ణచతుర్భుజి రోడ్లు వచ్చాయి. ఓపెన్ స్కై పాలసీ వల్ల విమానయాన రంగంలో అనూహ్య మార్పులు వచ్చాయి. పిపిపి విధానం వల్ల సంపద సృష్టి జరిగింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. నాడు హైదరాబాద్ లో చేసిన ప్రతి అభివృద్ధి నేడు అద్భుత ఫలితాలను ఇస్తోంది" అని సిఎం అన్నారు. ఆయా నిర్ణయాల సమయంలో తాను ఎదుర్కొన్న విమర్శలను కూడా గుర్తుచేసుకున్నారు. అయినా సరే మంచి సంకల్పంతో తీసుకున్న నిర్ణయాల వల్ల ఫలితాలు వచ్చాయని సిఎం అన్నారు."

విభజన తరవాత మళ్లీ ఎపిలో పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. 2019లో ప్రభుత్వం కొనసాగి ఉంటే రాష్ట్రం ఎంతో పురోగతి సాధించేది. రాష్ట్రాల అభివృద్ధిలో సుస్థిర ప్రభుత్వం అనేది కూడా ముఖ్యం. అప్పుడే అనుకున్న విధంగా ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. ప్రజలకు మేలు జరుగుతుంది"అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

"2024 ఎన్నికల్లో ప్రజలు తిరుగు లేని తీర్పు నిచ్చారు. ప్రభుత్వంపై అనేక ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. వీటిని నెరవేర్చే క్రమంలో అనేక నిర్ణయాలు తీసుకున్నాం. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలసీలు తెచ్చాం. ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడులు వస్తున్నాయి. ఇది మంచి పరిణామం. మనకున్న పేరుతో, కొత్తపాలసీతో మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయి. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజెనెస్ అన్నాం...ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజెనెస్ అంటున్నాం. దీనికి అనుగుణంగా సమస్త అధికార యంత్రాంగం పనిచేయాలి" అని సిఎం సూచించారు.

"రాష్ట్రం ఉన్నపరిస్థితుల నేపథ్యంలో వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. తొందరగా ఫలితాలు రాబట్టాలి. టెక్నాలజీ సాయంతో చాలా మంచి ఫలితాలు వస్తాయి. ప్రతి శాఖలో టెక్నాలజీ వాడకాన్ని పెంచాలి. రానున్న రోజుల్లో 150 సర్వీసులు వాట్సాప్ ద్వారా ఇవ్వనున్నాం. దీనికి సమాయత్తం కావాలి. ఆధార్ ను సమర్థవంతంగా ఉపయోగిస్తాం. ప్రతి ఇల్లు జియో ట్యాగ్ చేస్తాం. పింఛన్లు ఇంటి వద్దనే ఇచ్చారా లేదా అనేది రియల్ టైంలో తెలిసిపోతుంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సిసి కెమేరాలు, డ్రోన్లు, రియల్ టైం డాటాను సమర్ధవంతంగా వినియోగిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. రెవెన్యూ శాఖలో చాలా సమస్యలున్నాయి. వీటన్నింటికి పరిష్కారం చూపాలి. రాత్రింబవళ్లు పనిచేయాల్సిన అవసరం లేదు. స్మార్ట్ వర్క్ చేయండి. టెక్నాలజీని వాడండి కచ్చితంగా ఫలితాలు వస్తాయి" అని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు.

"ప్రజలకు 5 ఏళ్ల కాలంలో ఏం చేయాలి అని మాత్రమే కాదు... భవిష్యత్ అవసరాలను గుర్తించి విజన్ 2047ను తీసువచ్చాం. ఇందులో పేర్కొన్న 10 లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృష్టిచేయాలి. అన్ని కార్యక్రమాలకు డబ్బుతోనే కాదు... కొత్త ఆలోచనలతో కొత్త మార్గాల్లో ప్రయాణం చేయాలి. మంచి చేయాలనే తపన, ఆలోచన ఉంటే చాలా అంశాల్లో ప్రజలకు మేలు చేయవచ్చు. 2025 సంవత్సరం ఆ తరహా ఆలోచనలకు వేదిక కావాలని కోరుకుంటున్నా. 2025 గేమ్ చేంజర్ లో కీలకం కావాలి. అతిపెద్ద మార్పుకు ఈ ఏడాదిలో నాంది పడాలి" అని సిఎం అన్నారు." రూ. 80 వేల కోట్లతో గోదావరి నీళ్లు బనకచర్లకు సాధ్యమా అని అడుగుతున్నారు. అర్థికంగా అతి పెద్ద ప్రాజెక్ట్.. అయినా సరే దీన్ని చేపట్టాలి. ఇది రాష్ట్ర దశ దిశ మారుస్తుంది. ఇప్పుడు చేపట్టకపోతే ఈ ప్రాజెక్టును ఇక ఎప్పటికీ చేపట్టలేం. ఇవన్నీ ప్రజల జీవితాల్లో నేరుగా మార్పులు తెచ్చే కార్యక్రమాలు" అని సిఎం అన్నారు.

"నేను మీ నుంచి వినూత్న ఆలోచనలు కోరుకుంటున్నా. 1995లో మా దగ్గర డబ్బు లేదు. కానీ ఆలోచనలతో మార్పు తెచ్చాం. అధికారులు సరికొత్త ఆలోచనలతో పనిచేస్తే ఫలితాలు వస్తాయి. కలిసి సమిష్టిగా, వేగంగా అడుగులు వేద్దాం. మనం ఎంత వేగంగా, సమర్థవంతంగా పనిచేస్తే అంత త్వరగా ఫలితాలు వస్తాయి అని సిఎం అన్నారు. ఈ సందర్భంగా పాలనా అంశాలపై అధికారులు కొందరు తమ అభిప్రాయాలు చెప్పారు. అతి పెద్ద పెట్టుబడులు పెట్టే సంస్థల కార్యకలాపాలు వేగంగా కార్యరూపం దాల్చడం కోసం ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించాలని సూచించారు. ఈ సూచనను సిఎం స్వాగతించారు. అలాగే ఆయా శాఖలకు సంబంధం ఉన్న పెద్ద పెద్ద సంస్థలు సిఎస్ఆర్ కోసం నిధులు ఖర్చు చేస్తాయని... వాటిని ఒక గొడుగుకిందకు తెచ్చి మంచి ఫలితాలు వచ్చేలా వాటిని ఖర్చు చేసేలా చూడాలని సూచించారు. దీనికికూడా సిఎం అంగీకారం తెలిపారు. 2025 మార్పునకు, వేగానికి, పాలనను కొత్త పుంతలు తొక్కించడానికి, ప్రజల సంతృప్తిని పెంచడానికి వేదిక కావాలని... ఆ దిశగా అన్ని స్థాయిల్లో సిబ్బంది, అధికారులు, పనిచేయాలని సిఎం కోరారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 02, జనవరి 2025



## బీసీ మహాసభ పోస్టర్ విడుదల చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

- కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక సంస్థల్లో 42% బీసీ కులాలకు రిజర్వేషన్ల అమలుకై ఈ నెల 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభ
- మద్దతు ప్రకటించిన సర్పంచ్ ల సంఘం జేఏసీ, తెలంగాణ విద్యార్థి జేఏసీ
- జిల్లాల నుంచి భారీ స్పందన

**హైదరాబాద్:** బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తడితేవడానికి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ మహాసభ పోస్టర్ ను ఆ సంస్థ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం విడుదల చేశారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్న డిమాండ్ తో సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీన ఇందిరా పార్కు వద్ద బీసీ మహాసభ పేరిట తెలంగాణ జాగృతి సంస్థ భారీ సభను తలపెట్టనుంది.

ఈ బీసీ మహాసభకు తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ విద్యార్థి జేఏసీతో పాటు మరిన్ని ప్రజా సంఘాలు, కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి.

బీసీల కోసం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ కవితకు తాము వెన్నుదన్నుగా నిలుస్తామని ఆ సర్పంచ్ ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ప్రకటన చేశారు. తాము పెద్ద సంఖ్యలో మహాసభకు హాజరవుతాయని, తమ హక్కులను సాధిస్తామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం కాలయాపన చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూడా బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయలేదని చెప్పారు. కాబట్టి కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడం, రిజర్వేషన్ల పెంపు ప్రధాన డిమాండ్లుగా తాము మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఈ బీసీ మహాసభలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు.

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ముందు బీసీ మహాసభ పోస్టర్లను తెలంగాణ విద్యార్థి జేఏసీ ప్రదర్శించింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు ఎమ్మెల్సీ కవిత చేస్తున్న కృషికి తాము మద్దతు ప్రకటిస్తున్నామని, విద్యార్థి లోకమంతా ఎమ్మెల్సీ కవిత చేపడుతున్న కార్యక్రమల్లో పాల్గొంటామని ప్రకటించారు. కవిత నివాసంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొల్లా శివశంకర్, పెంట రాజేష్, సుంకోజు కృష్ణమాచారి, ఆలకుంట్ల హరి, కుమారస్వామి, విజేందర్ సాగర్, రాచమల్ల బాలకృష్ణ, కోళ్ల శ్రీనివాస్, సాల్వా చారి, మురళి, నిమ్మల వీరన్న, లింగం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర కానుంది

**- మంత్రి సుభాష్**

**రామచంద్రపురం1:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కార్మికశాఖ వాసంశెట్టి సుభాష్‌కి శుభాకాంక్షలు తెలిపేందుకు తరలి వచ్చిన వారితో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని VSM కళాశాల ప్రాంగణం జన సంద్రంలా మారింది. ఒక ప్రక్క అధికారులు, మరోపక్క కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులుతో కళాశాల ప్రాంగణం సందడి పండుగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రం స్వర్ణాంధ్ర అవుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తెలుగు ప్రజలు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2025 సంవత్సరం అందరికీ ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవితం కలగాలని ఆకాంక్షించారు. 2024 లో సంవత్సరంలో ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో ఏర్పడిన మీ మంచి ప్రభుత్వం అందరి ఆశలు నెరవేర్చేలా అహర్నిశలు పని చేస్తోంది అన్నారు.





**నూతన సంవత్సరం సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్ నివాసంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరామ్ చిన్నబాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులు అన్ని స్థాయిలో ఉన్న నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు**

## సంకల్పం



ఏదో సాధించాలనే
తపనతో
ప్రారంభమౌతున్న సంవత్సరాన్ని
ఏదీ సాధించలేదనే
నిట్టూర్పుతో
అంతమొందిస్తున్నాం !

వృధాగా గడిచిపోయిన
శూన్య సాధన వత్సరాలన్నింటినీ
ఇప్పటికైనా
మదింపు చేసుకుందాం

లోపమెక్కడుందో
కారణమెప్పటిదో
మననం గావిద్దాం !

ఆరంభ శూరత్వంతో
అంతిమ విజయం
అందలేదా ?
రోజూ మారుతున్న తేదీలతో
రాజీ పడిపోతున్నామా ?

ఎన్నాళ్ళని
ఈ నిరాశా నిస్పృహ
ఎన్నేళ్ళని
ఈ అసహనం,అపోహ!

ఆత్మ పరిశీలన చేసుకొని
ఆత్మవిశ్వాసం పెంచుకొని
దృక్పథం మార్చుకొని
స్వీయ శపథం దీక్ష బూని
అడుగు ముందుకేద్దాం
అనుకున్నది గెలుద్దాం!

కాలంతో పోటీపడి
కాలరెగరేసినప్పుడే కదా
అసలైన విజయం !

- పి.లక్ష్మణ్ రావ్
అసిస్టెంట్ రిజిస్ట్రార్
సహకార శాఖ విజయనగరం
94412 15989

## రేవంత్‌జీ.. కృతజ్ఞతలు

- మెట్రో రైల్‌ను మేడ్చెల్-శామీర్‌పేట వరకూ పొడిగించడంపై మంత్రి పొన్నం హర్షం



**హైదరాబాద్:** నూతన సంవత్సర కానుకగా శామీర్ పెట్, మేడ్చల్ వరకు మెట్రో మార్గాలను పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే గతంలో శామీర్ పేట వరకు మెట్రో ను పొడిగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు.

సుదీర్ఘ కాలంగా ఉత్తర తెలంగాణ జిల్లాలు కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ వైపు వెళ్లే వాహనాలు నగర శివారు వరకు నిత్యం ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ఈ రూట్లలో ఇప్పటికే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ కి మంజూరు కావడం, తాజాగా తమ ఇబ్బందులు తొలిగేలా జేబీఎస్ నుండి శామీర్ పెట్ (22 కిలోమీటర్లు) , ప్యారడైజ్ నుండి మేడ్చల్ (23 కిలోమీటర్లు) వరకు మెట్రో మార్గానికి మెట్రో రైల్ ఫేజ్ -2 'బి' భాగంగా డీపీఆర్ తయారు చేయాలని మెట్రో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడంతో తమ ప్రాంత కష్టాలు తొలగనున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

మెట్రో మార్గాన్ని శామీర్ పేట ,మేడ్చల్ వరకు పెంచడానికి డీపీఆర్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మెట్రో పూర్తయితే రాజధాని హైదరాబాద్ నగరం నుండి ఉత్తర తెలంగాణ జిల్లాలకు చాలా సమయం ఆదా అవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.





## చంద్రబాబుతో కలిసి కనకదుర్గమ్మని దర్శించుకున్న హోంమంత్రి అనిత

- ఉండవల్లి నివాసంలో కలిసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన హోంమంత్రి
- కొత్త సంవత్సరం సందర్భంగా హోంమంత్రి అనితని కలిసిన పోలీస్ ఉన్నతాధికారులు
- తెలుగు ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు
- హోంమంత్రి వంగలపూడి అనిత

**ఉండవల్లి:** ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను హోంమంత్రి అనిత నిరాడంబరంగా జరుపుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఉండవల్లి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల నిర్వహన అనంతరం ఆలయ పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ ఆశీర్వచనం స్వీకరించడం గొప్ప అవకాశంగా పేర్కొన్నారు.

అనంతరం హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో పోలీస్ ఉన్నత అధికారులు హోంమంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్‌తో పాటు పలువురు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు హోం మంత్రి అనితతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

రాబోయే రోజుల్లో విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో ఏపీ స్వర్ణాంధ్ర విజన్-2047 త్వరలోనే సాకారమవుతుందన్న ఆకాంక్షను వెల్లడించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో సంతాప దినాలు ప్రకటించినందున పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలతో వేడుకలు జరుపుకోలేకపోయానని.. వారికి ఎల్లప్పుడూ అందు బాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలందరి భాగస్వామ్యం కావాలని కోరారు.



## వేదవ్యాస్ నివాసానికి వంగవీటి రాధా



**పెడన:** టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు బూరగడ్డ వేదవ్యాస్ నివాసానికి, మాజీ ఎమ్ ఎల్ ఎ వంగవీటి రాధాకృష్ణ వచ్చారు. విజయవాడలో గురునానక్ కాలనీ లోని వ్యాస్ నివాసంలో వీరిద్దరి మధ్య రాజకీయ పరమైన చర్చ జరిగింది.

ఇలా ఉండగా వీరిద్దరి భేటీ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. తొలుత వేదవ్యాస్ కు రాధాకృష్ణ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## గోవా గోల్..మాల్

**(జానకీదేవి, తణుకు)**

గోవాలోని ప్రతి బీచ్‌లో వేడుకలు ఉత్సాహంగా జరుగుతుంటాయి. నైట్ పార్టీలలో సందడి తారా స్థాయికి చేరుతుంది. ఈ పార్టీలకు హాజరు కావడానికి ఎక్కడెక్కడ నుంచో పర్యాటకులు వస్తుంటారు. ఆకాశమే హద్దుగా సందడి చేస్తుంటారు. మరి కొంతమంది బీచ్ ఒడ్డున కూర్చుని సముద్రాన్ని చూస్తూ.. అక్కడ రకరకాల సాహస క్రీడలలో పాలుపంచుకుంటారు. సముద్ర ప్రాంతం కాబట్టి ఇక్కడ రకరకాల వంటకాలు అందుబాటులో ఉంటాయి.

సీ ఫుడ్ లో ప్రపంచ స్థాయిలో ఉంటుంది. పైగా ఇక్కడ పోర్చుగీస్ తరహాలో భవనాలు ఉంటాయి. పేరుకు గోవా ఇండియా లో ప్రాంతమైనప్పటికీ ఇక్కడ పాశ్చాత్య సంస్కృతి కనిపిస్తుంది. మద్యం ధరలు ఇక్కడ తక్కువగా ఉంటాయి. ప్రతిరోజు ఇక్కడ పార్టీ కల్చర్ కనిపిస్తుంది కాబట్టి.. పర్యాటకులు ఎక్కువగా వస్తూ ఉంటారు.

విదేశాల నుంచి కూడా భారీగా వస్తూ ఉంటారు. గోవా చిన్న రాష్ట్రం కాబట్టి.. పర్యాటకం ద్వారా వచ్చే ఆదాయమే ఈ రాష్ట్రానికి ప్రధాన వనరు. అందువల్లే ఇక్కడ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం విస్తృతంగా చర్యలు తీసుకుంటూ ఉంటుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో కాటేజీలు, రిసార్టులు, రెస్టారెంట్లు ఉంటాయి. ప్రైవేట్ ఆధ్వర్యంలో కూడా ఇదే స్థాయిలో ఉంటాయి.

సాధారణంగా డిసెంబర్ 31 నైట్ వేడుకలు అంబరాన్ని అంటే విధంగా సాగుతుంటాయి. ప్రత్యేకంగా ఈ వేడుకల కోసం ఎక్కడెక్కడ నుంచో పర్యాటకులు గోవా వస్తూ ఉంటారు. పర్యాటకుల తగ్గట్టుగా ఇక్కడికి హోటల్స్ ప్రత్యేక ఆఫర్లు పెడుతుంటాయి. రాత్రి మొత్తం పర్యాటకులు చిల్ అయ్యేవిధంగా రకరకాల ఏర్పాట్లు చేస్తుంటాయి. మద్యం, వంటకాలు, ప్రత్యేకంగా గడిపేందుకు గదులు వంటి అనుభూతులను పర్యాటకు ఇస్తుంటాయి. అయితే గోవాలో




ఈసారి పరిస్థితి విరుద్ధంగా మారింది.

పర్యాటకులతో సందడిగా ఉండాల్సిన గోవా ప్రాంతం నిర్మానుష్యంగా కనిపిస్తోంది. పర్యాటకులు లేక రెస్టారెంట్లు, రోడ్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. గతంలో నూతన సంవత్సర వేడుకల ముందు హోటళ్లు కిటకిటలాడేవి. రూములు కూడా దొరకపోయేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.. మన దేశానికి పక్కనే ఉన్న బాలి, థాయిలాండ్, వియత్నాం వంటి దేశాలకు ఫ్లైట్ టికెట్ ధరలు తక్కువగా ఉన్నాయి. గోవా కైతే ఫ్లైట్ టికెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. దీనికి తోడు ఈ ప్రాంతంలో మోసాలు ఇటీవల పెరిగాయి.

పర్యాటక సేవలు గతంలో మాదిరిగా లేవు. దీంతో ఇక్కడికి రావాలంటేనే పర్యాటకులు భయపడుతున్నారు. ఇక స్థానికంగా ఉన్న రిసార్టు కూడా ప్రత్యేక ఆఫర్లు ఇవ్వడంతో.. అక్కడిదాకా వెళ్లడం ఎందుకనిచాలామంది గోవా రావడానికి విముఖత ప్రదర్శిస్తున్నారు. పర్యాటకులు రాకపోవడంతో తమ వ్యాపారాలు మొత్తం పడిపోయాయని గోవాలోని స్థానికులు వాపోతున్నారు.

" గతంలో చేతినిండా వ్యాపారాలు జరిగేవి. మాకు లాభాలు కూడా భారీగానే వచ్చేవి. ఈసారి పరిస్థితి మారి పోయింది. ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదు. ఈసారి మాకు భారీ నష్టాలు తప్పేలా లేవని" గోవాలోని హోటళ్ల నిర్వాహకులు చెబుతున్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 02, జనవరి 2025






నూతన సంవత్సరం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు. కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల కొండపై తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో భోజనం చేసి తన అభిప్రాయాన్ని రికార్డుల్లో నమోదు చేసిన డిప్యూటీ సీఎం.

# బెనిఫిట్ షోలను రద్దు చేసినందుకు అభినందనలు

- ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమకారులు, సామాజిక, సాహితీరంగాలలో మేధావుల ప్రకటన

**అమరావతి:** కొత్త సినిమాల బెనిఫిట్ షోలను రద్దు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి వివిధ ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమ కారులు, సామాజిక, సాహితీ రంగాలలో పలువురు మేధావులు అభినందనలు తెలిపారు. ఇటీవల కాలంలో కొత్త సినిమాలు విడుదల సందర్భంగా నిర్మాతలు బెనిఫిట్ షోల ద్వారా ప్రజల నుంచి డబ్బుని విచ్చల విడిగా కొల్లగొడుతున్నారని బుధవారం వారు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.

ఈ అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట వేసిన తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత మైనచర్య ఎంతైనా హర్షించ దగిందని పేర్కొన్నారు. ఒకనాడు సినిమా హాల్ బైట, అసలు రేటు కంటే ఎక్కువ ధరకు టికెట్లు అమ్మే వాళ్లను బ్లాక్ టికెట్లు అమ్మిన నేరం కింద పోలీసులు అరెస్టు చేసే వాళ్లు, నేడు నిర్మాతలు పబ్లిక్‌గా, ఏ అదురు..బెదురూ లేకుండా దర్జాగా చాలా ఎక్కువ రేట్లకు బ్లాక్ టికెట్స్ అమ్ముకోవడానికి, ప్రభుత్వాలు అనుమతులివ్వటం ఎంతమాత్రం సమర్ధనీయం కాదన్నారు.

ఎవరైనా ఉదార స్వభావులైన నిర్మాతలు బెనిఫిట్ షోల ద్వారా వచ్చే సొమ్మును, ప్రజల అవసరాల కోసం వినియోగించ డానికి పూనుకుంటే, అటువంటి ప్రజా ప్రయోజన కార్యా న్ని ఎవరూ ఆక్షేపించరన్నారు. అటువంటి సేవా కార్యక్రమాన్ని తాము కూడా సమర్ధిస్తామని తెలిపారు. సినిమా అనేది ప్రజల ఆలోచనలను మంచి వైపు గానీ, చెడు వైపు గానీ మళ్లించే ఒక శక్తి వంతమైన ఆయుధమని, ఆ శక్తి వంతమైన ఆయుధం ఈనాడు ప్రజలను, ముఖ్యంగా యువ తను చెడు వైపు మళ్ళేలా చేయటం చాలా అవాంఛనీయమని పేర్కొన్నారు. నేడు నూటికో కోటికో ఒకటి అర తప్ప, మిగిలిన అన్ని సినిమాలు సమాజం పట్ల ఏ మాత్రం బాధ్యత లేకుండా, మితి మీరిన స్వార్ధమే పరమావధిగా రావటం ఎంతైనా శోచనీయమన్నారు.

ఒకనాడు సినీ నిర్మాతలు, దర్శకులు, హీరోలు సినిమాను కేవలం లాభాలను ఆర్జించే వ్యాపార వస్తువుగా చూడలేదని, కుటుంబ సంబంధాలు,అనుబంధాలు - ఆత్మీయతలు, నైతిక విలువలు, అహింస, క్షమ, దయ, మానసిక పరివర్తన, పరోపకారం, మానవీయ భావనలు, దేశభక్తి, సంఘ సమైక్యత,



మత సామరస్యం.. వంటి అనేక గొప్పవిషయాలను ప్రతిభా వంతంగా సినిమాల్లో చూపించేవారని గుర్తు చేసుకున్నారు. నేటి నిర్మాతలు, దర్శకులు, హీరోలు అలనాటి సినిమా రంగం పాటించిన నీతిని, విలువలను, సమాజ క్షేమాన్ని అన్నిటిని ధ్వంసం చేయటమే పనిగా పెట్టుకుని, సినిమాలను రూపొం దిస్తున్నారని మండిపడ్డారు.

సినిమాకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల ముందు వారు కొన్ని అంశాలను ఉంచారు. సినిమాల్లో తీవ్రమైన హింస, అశ్లీలత, పచ్చి బూతు పాటలు, మాటలు, అంధ విశ్వాసాలు నివారించేందుకు సెన్సార్ బోర్డు సభ్యులకు సరైన మార్గ దర్శకం చేయాలని సూచించారు.

సెన్సార్ బోర్డు సభ్యులుగా ఎలాంటి వత్తిళ్ళకు లొంగని సామాజిక బాధ్యత గల మేధావులను, వివిధ ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమ కారులను, వివిధ సేవారంగ ప్రముఖులను నియమించాలని కోరారు. హీరోలు చట్ట విరుద్ధమైన, నేర స్వభావంతో సాగే కథాంశాలతో వచ్చే సినిమాలకు సెన్సార్ బోర్డు వారు ఎంత మాత్రం అనుమతి ఇవ్వకూడదని హితవు పలికారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయాన్ని ఆదర్శంగా తీసుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా బెన్ఫిట్ షోలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో మానవ వికాస మండలి కన్వీనర్ రేకా కృష్ణార్జునరావు, స్టెప్ (STEP) వ్యవస్థాపకులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు,ఓపీడీఆర్ ఆలిండియా అధ్యక్షుడు సి.భాస్కరరావు, అరసం ఏపీ అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ నూర్ బాషా, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు, లాల్ -నీల్ మైత్రి వేదిక ప్రతినిధి రేకా చంద్ర శేఖరరావు, అశ్లీలతా ప్రతిఘటనా వేదిక ఏపీ అధ్యక్షులు ఈదర గోపీ చంద్, ప్రజా వేదిక కన్వీనర్ కె.కుమార్ రెడ్డి, చైతన్య సాహితీ వేదిక కో-కన్వీనర్ గోలి మధు, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు బొజ్జా భిక్షమయ్య, అడ్వకేట్ పాటి బండ్ల కోటేశ్వరరావు, సామాజిక ఆంధ్ర మహాసభ ప్రతినిధి చెముకుల సుధాకర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చిలువూరు నాగేశ్వరరావు, మహా జ్ఞాన సమాజం అధ్యక్షులు విశ్వనాథ్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి నాయకులు కంచర్ల కాశయ్య, విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, కవి, సాహితీ విమర్శకులు ఎ.రజాహుస్సేన్, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ప్రతినిధి బందారి లక్ష్మయ్య, మానవ హక్కుల వేదిక, సామాజిక కార్యకర్తలు మార్పు శరత్,ఆకురాతి సతీష్, కూరపాటి సాంబశివరావు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ప్రతినిధి లోకం భాస్కరరావు తదితరులు ఉన్నారు.

# రేవంత్ మనసులో 'దిల్' ఖుషీ

- కేటీఆర్‌పై దిల్ రాజు విమర్శలు
- రేవంత్‌ను మెప్పించిన అగ్ర నిర్మాత
- రేవంత్ కోరుకున్నదే 'దిల్' చెప్పారా?

**(వాసు)**






రోగి-వైద్యుడి చందం మాదిరిగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మనసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురించి చెప్పాల్సినవన్నీ ఎఫ్‌డీ సీ చైర్మన్, అగ్ర నిర్మాత దిల్ రాజు చెప్పేశారా?.. లేక చెప్పించారా?.. ఏదైతేనేం.. కేటీఆర్‌పై దిల్‌రాజు ఫైరయ్యారు. సహజంగా సినిమా ప్రముఖులు రాజకీయ పార్టీలపై విమర్శలు చేసే రిస్కు తీసుకోరు. అందునా బోలెడన్ని థియేటర్లు చేతిలో ఉన్న దిల్‌రాజు వంటి బడా నిర్మాతలు అలాంటి రిస్కు అస్సలు చేయరు. కానీ టిఎస్ ఎఫ్‌డిసి చైర్మన్ హోదాలో కేటీఆర్‌పై విమర్శలు చేశారంటే.. ఆయన రేవంత్ 'దిల్'ను ఖుషీ చేసినట్టే కదా? అదే ఇప్పుడు సినిమా-రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్.

సినీ పరిశ్రమను ముందు పెట్టుకుని తనను టార్గెట్ చేస్తున్న కేటీఆర్‌కు ఎందుకు కౌంటర్ ఇవ్వరని .. సీఎం రేవంత్ రెడ్డి వేసిన ప్రశ్నలకు చిత్ర పరిశ్రమ వద్ద సమాధానం లేకపోయింది. కేటీఆర్ పదే పదే పేరు మర్చిపోయాడని అరెస్టు చేశారని ప్రకటనలు చేస్తున్నారు. దీనిని సినీ పెద్దలు ఎందుకు ఖండించలేదని కమాండ్ కంట్రోల్ సెంటర్ భేటీ సందర్భంగా రేవంత్ వారిని ప్రశ్నించారు. ఇప్పుడు ఆ ప్రశ్నలకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ దిల్ రాజు సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు.

చిత్ర పరిశ్రమను రాజకీయాలకు వాడుకోవద్దని దిల్ రాజు .. తన పదవి పేరుతో క్రియేట్ చేసిన ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా కాస్త ఘాటుగానే కేటీఆర్‌కు సమాధానం ఇచ్చారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం ఎలాంటి దాపరికాల్లేకుండా జరిగిన ఈ సమావేశంలో పూర్తి స్నేహభావంతో జరిగిందన్నారు. అనవసర వివాదాల్లోకి..రాజకీయాల్లోకి చిత్ర పరిశ్రమను లాగవద్దని ..రాజకీయ దాడి, ప్రతిదాడులకు చిత్ర పరిశ్రమను వాడుకోవద్దని అందర్నీ కోరుతున్నామన్నారు

చిత్ర పరిశ్రమ భేటీపై కేటీఆర్ కాస్త వివాదాస్పద వ్యాఖ్యలుచేశారు. డైవర్ట్ చేసే క్రమంలో అల్లు అర్జున్ ను టార్గెట్ చేశారని.. సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి సినిమా వాళ్లపైన పడి అటెన్షన్-డైవర్షన్ కోసం ముఖ్యమంత్రి పాకులాడారని విమర్శించారు. సినిమా వాళ్ళ నుంచి సెటిల్మెంట్ చేసుకొని ఇప్పుడు సైలెన్స్‌గా ఉన్నాడని అన్నారు.

కేటీఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేసిన తర్వాత కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పదవిని స్వీకరించిన దిల్ రాజు సైలెంట్ గా ఉండటం మంచిది కాదని చాలా వైపుల నుంచి సలహాలు రావడంతో ఆయన మధ్యే మార్గంగా సోషల్ మీడియాను ఎంచుకున్నారు. అప్పటికప్పుడు తన పదవి పేరుతో ట్విట్టర్ అకౌంట్ర క్రియేట్ చేయించి అందులో తన వాదన వినిపించారు.



# కరెంటు స్తంభం పైకి... 'మద్యం మత్తు'!

## - భీతిల్లిన గ్రామస్తులు

**పాలకొండ, మహానాడు:** మన్యం జిల్లా, పాలకొండ మండలం ఎం.సింగిపురంలో ఓ వ్యక్తి మద్యం తాగి గ్రామస్థులను హడలెత్తించాడు. మద్యం మత్తులో కరెంటు స్తంభంపైకి ఎక్కుతుండటంతో చూసిన పలువురు వెంటనే ట్రాన్స్ ఫార్మర్ వద్ద సప్లై ను నిలిపివేశారు.

అయితే, మద్యం మత్తులో ఉన్న అతను గ్రామస్తులు హెచ్చరిస్తున్నా అతను ఆగకుండా పైకి వెళ్లి, ఏకంగా విద్యుత్ తీగలపైనే పడుకున్నాడు. కాసేపు అక్కడే విన్యాసాలు చేశాడు. మొత్తానికి అందరూ కలిసి బలవంతంగా అతడిని కిందికి తీసుకొచ్చారు.

# ఉత్తరద్వార దర్శనం ఎందుకు?

వైకుంఠ ఏకాదశి వస్తోందనగానే ఉత్తర ద్వార దర్శనమే గుర్తుకువస్తుంది. వైష్ణవాలయాలలో ప్రత్యేకించి ఏర్పాటు చేసే ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. అందుకనే ఆ రోజు తెల్లవారుజాము నుంచే ఉత్తరద్వార దర్శనం చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. మనం ఇంతగా తపించిపోయే ఉత్తరద్వార దర్శనం ప్రత్యేకత ఏమిటి?

### పౌరాణిక గాథ

పాలసంద్రం మీద తేలియాడే విష్ణుమూర్తిని దర్శించు కునేందుకు ముక్కోటి దేవతలంతా ఈ ఏకాదశి తిథినాడు వైకుంఠాన్ని చేరుకుంటారని ప్రతీతి. అందుకనే ఈ ఏకాదశికి ముక్కోటి ఏకాదశి అన్న పేరు వచ్చింది. మూడు కోట్ల ఏకాదశులకూ సమానం కావడం చేతనే ఆ పేరు వచ్చిందన్న వాదనా లేకపోలేదు. వైకుంఠంలోని విష్ణుమూర్తి దర్శనమే ఈ ఏకాదశి నాడు ముఖ్యమైన ఘట్టం కాబట్టి దీనికి వైకుంఠ ఏకాదశి అన్న పేరూ ఉంది.

ఈరోజు మహావిష్ణువుని వైకుంఠద్వారం వద్ద దర్శించు కున్న మధుకైటభులనే రాక్షసులకి శాపవిమోచనం కలిగిం దట. ఇక నుంచి ఎవరైతే ఆ వైకుంఠ ద్వారాన్ని పోలిన ఉత్తరద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకుంటారో, వారందరికీ కూడా తమలాగే మోక్షం కలగాలని ఆ మధుకై టభులు కోరుకోవడంతో... ఉత్తర ద్వార దర్శనానికి ప్రాశస్త్యం ఏర్పడిందంటారు. ఉత్తర ద్వార దర్శనం నాడు తనని దర్శించుకునే భక్తులను అనుగ్రహించుకునేందుకు ముక్కోటి దేవతలతో కలిసి విష్ణుమూర్తి భువికి చేరు కుంటారట.

### గాథ వెనుక తత్వం

మనకి పై దిశగా ఉండే దిక్కుని ఉత్తరం అంటాము. అలా ఉత్తరం దిక్కు అభివృద్ధిని, వికాసాన్నీ సూచిస్తుంది. బహుశా అందుకేనేమో పాతాళం వైపుకి సూచించే దక్షిణపు దిక్కుని మనం యమస్థానం అంటాము. మన శరీరంలోనూ జ్ఞానానికి నిలయమైన మెదడు ఉత్తరభాగంలో ఉంటుంది. ఆ జ్ఞానం సంపూర్ణంగా వికసించి, సిద్ధ స్థితిని చేరుకుంటేనే ఆ ఊర్ధ్వభాగంలో ఉన్న సహస్రార చక్రం వికసిస్తుందని అంటారు.

అంటే ఆ హరి దర్శనం మనలోని అజ్ఞానాన్ని హరింప చేసి...శాశ్వతమైన శాంతినీ, సత్యమైన జ్ఞానాన్నీ ప్రసా దించమని ఆ విష్ణుమూర్తిని వేడుకోవడమే ఈ ఉత్తర ద్వార దర్శనం వెనుక ఉన్న ఆంతర్యం కావచ్చు. అందుకే ఈ రోజున ఉత్తరద్వార దర్శనం చేసుకునే భక్తులు కేవలం దీనిని



ఒక ఆచారంగా కాకుండా... తమలోని భక్తినీ, జ్ఞానాన్నీ వికసింపచేయమనీ వేడుకుంటూ స్వామిని కొలుచుకోవాలి. ఇక ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకోలేని భక్తులు... తమ మనసులోనే ఆ వైకుంఠ మూర్తిని దర్శించుకుని తమలోని అజ్ఞానాంధకారం తొలగిపోయేలా దీవించమంటూ వేడుకోవాలి.

హైందవ సంప్రదాయం భక్తుని మనసు పరిపక్వమై అది అనంతాత్మలో లీనమవ్వాలంటూ ప్రోత్సహిస్తుంది. గాయత్రి మంత్రాన్ని జపించినా, ఉత్తర ద్వార దర్శనంగుండా ఆ విష్ణుమూర్తిని దర్శించుకున్నా... ఆ భక్తుని మేధస్సు వికసించాలనే కోరుకుంటుంది.

- సువర్చల



ఏపీ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల స్వీకరించిన విజయానంద్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



మైలవరం పట్టణంలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ బుధవారం పాల్గొన్నారు.



పెనుగొండ పట్టణంలోని పార్లమెంట్ సభ్యుల కార్యాలయంలో హిందూపురం పార్లమెంటు సభ్యులు బి కె పార్థసారథికి గజమాలతో సత్కరించినూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేసిన హిందూపురం పార్లమెంట్ పరిధిలో ఉన్న నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ మరియు కూటమి నాయకులు.



నూతన సంవత్సరం సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో శాసనసభ్యులుశ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి.



ఏపీడబ్ల్యుజేఎఫ్ డైరీని ఆవిష్కరించిన మంత్రి కొలుసు పార్థసారథి



నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 02, జనవరి 2025



మడకశిర మండలం కల్లుమరి పంచాయతీకి చెందిన వైసిపి పార్టీ నాయకులు వైసీపీ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ ఎమ్మెస్ రాజు గారు మరియు మడకశిర తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు పసుపు కండువా కప్పుకొని తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్లు మరి సర్పంచ్ నాగరాజు మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# 6 నెలల్లో అద్భుత ప్రగతి మాది!

- నేను చేసింది ఇదీ..
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జాబితా విడుదల



**అమరావతి, మహానాడు:** ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఆరున్నర నెలలు గడిచిపోయింది. ఈ నేపథ్యంలో ఈ ఆరున్నర నెలల కాలంలో తాను ఏం చేశాననే వివరాలను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. పిఠాపురం ఎమ్మెల్యేగా ఈ ఆరున్నర నెలల్లో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను నూతన సంవత్సరం సందర్భంగా పవన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. భవిష్యత్తులోనూ మీ ప్రేమ, అభిమానాలను ఇలాగే అందించాలని కోరారు. సమగ్ర అభివృద్ధి నివేదిక -2024 పేరుతో ఈ నివేదిక విడుదల చేశారు.

నూతన సంవత్సరం సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ ఆరున్నర నెలల కాలంలో పిఠాపురం ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గ అభివృద్ధికి ఏమేం చేశాననే వివరాలను వెల్లడించారు. పిఠాపురం ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పర్యావరణ, అటవీ, సైన్స్‌అండ్ టెక్నాలజీ శాఖా మంత్రిగా చేసిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వివరించారు. పిఠాపురం ఎమ్మెల్యేగా పిఠాపురం సమగ్రాభివృద్ధి కోసం పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్టు, నియోజకవర్గ ప్రజల అవసరాన్ని గుర్తించి ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. అందుకు అవసరైన సిబ్బంది, మౌలిక సదుపాయాల కోసం రూ. 39.75 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. అలాగే సామాన్యులకు అందుబాటులో ఉండేలా, శ్రీవారి ఆశీస్సులతో తక్కువ ఖర్చుతో పెళ్ళిళ్ళు జరిపించేందుకు వీలుగా రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో టీటీడీ కల్యాణ మండపం మంజూరు చేసినట్టు తెలిపారు.

గొల్లప్రోలులో మంచినీటి సమస్య పరిష్కారం కోసం పైప్ లైన్, మోటార్ల మరమ్మతుల కోసం రూ. 72 లక్షల విలువైన పనులు చేపట్టామని.. విద్యార్థులకు చదువుతో పాటుగా, క్రీడలలో ఆసక్తి పెంచేందుకు నియోజకవర్గంలోని 32 పాఠశాలలకు క్రీడా సామగ్రి కిట్లను సీఎస్ఆర్ నిధులతో అందించామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేలా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కోసం సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక జనరల్ డ్యూటీ అటెండర్‌ను నియమించినట్టు వెల్లడించారు. అలాగే నూతన ఎక్స్ రే యూనిట్ ఏర్పాటు చేశామని.. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేయించి మంచినీటి సౌకర్యం కల్పించినట్టు వివరించారు.

ఏళ్లుగా పెద్ద సమస్యగా తయారైన గొల్లప్రోలు డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేలా చర్యలు మొదలు పెట్టామని పవన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తాత్కాలికంగా 1.5 ఎకరాల పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను 0.25 ఎకరాకు కుదించి చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రపరిచామన్నారు. అలాగే గొల్లప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేదారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. గొల్లప్రోలు ప్రాథమికోన్నత పాఠశాల కోసం రూ. 4 లక్షల సీఎస్ఆర్ నిధులతో పైప్ లైన్ ద్వారా నూతన ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. గొల్లప్రోలు ఎంపీపీ పాఠశాలలో 1.75 లక్షల సీఎస్ఆర్ నిధులతో పెండింగ్ పనులు పూర్తిచేశామని.. చేబ్రోలు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో రూ. 2 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు పవన్ కల్యాణ్ వివరించారు.

# డిసెంబర్‌లో రికార్డ్ స్థాయిలో మద్యం అమ్మకాలు

- డిసెంబర్ నెలలో రూ.3,805 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు నమోదు
- డిసెంబర్ 23 నుంచి 31 వరకే రూ.1,700 కోట్ల అమ్మకాలు
- డిసెంబర్ 30న ఒక్కరోజే రూ.402 కోట్ల సేల్స్
- మద్యం అమ్మకాల్లో పోటీపడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
- ఏపీలో డిసెంబర్ 30వ తేదీన రూ.219 కోట్లు.. డిసెంబర్ 31వ తేదీన రూ.113 కోట్లు మద్యం అమ్మకాలు
- తెలంగాణలో డిసెంబర్ 31వ రోజు రూ.403 కోట్ల మద్యం అమ్మకాలు
- డిసెంబర్ 28 నుండి ఈరోజు ఉదయం వరకే దాదాపు రూ.1800 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అంచనా...



**హైదరాబాద్:** తెలంగాణలో గత ఏడాది చివరి నెల... డిసెంబర్‌లో మద్యం అమ్మకాలు రికార్డ్ స్థాయిలో జరిగాయి. డిసెంబర్ 1 నుంచి 31 వరకు రూ.3,805 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. ముఖ్యంగా డిసెంబర్ 23 నుంచి డిసెంబర్ 31 వరకు అమ్మకాలు రోజు రోజుకూ పెరిగాయి. ఈ కొద్ది సమయంలోనే రూ.1,700 కోట్ల అమ్మకాలు జరిగాయి. 2023లో ఇదే సమయంతో పోలిస్తే రూ.200 కోట్ల పెరుగుదల నమోదైంది. డిసెంబర్ 30న అయితే ఏకంగా సగటున రోజువారీ సేల్స్ కంటే రెండింతల ఎక్కువ సేల్స్ జరిగాయి.

23వ తేదీ నుంచి 31 వరకు రోజువారీగా మద్యం అమ్మకాలు ఇలా ఉన్నాయి. డిసెంబర్ 23న రూ.193 కోట్లు, డిసెంబర్ 24న రూ.197 కోట్లు, డిసెంబర్ 24న రూ197 కోట్లు, డిసెంబర్ 26న రూ.192 కోట్లు, డిసెంబర్ 27న రూ.187 కోట్లు, డిసెంబర్ 28న రూ.191 కోట్లు, డిసెంబర్ 30న రూ.402 కోట్లు, డిసెంబర్ 31న రూ.282 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయి.

**కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులు**



# సీఎం హామీ ఇచ్చారు.. కలెక్టర్ అమలు చేశారు

- ఉల్లంగుల ఏడుకొండలుకు ఎయిర్ కంప్రెషర్ కలెక్టర్ అందజేత



**నరసరావుపేట, మహానాడు:** యల్లమంద గ్రామవాసి ఉల్లంగుల ఏడుకొండలు కుటుంబాన్నిఆర్థికంగా ఆదుకుంటామని, వ్యాపారం చేసుకునేందుకు సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని కలెక్టర్ పి.అరుణ్ బాబు వెంటనే అమలు చేశారు.

బుధవారం ఉదయం ఏడుకొండలు ఇంటిని కలెక్టర్ సందర్శించి ఎయిర్ కంప్రెషర్‌ను పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో భాగంగా ఉల్లంగుల ఏడుకొండలుకు ఇంటివద్దే పింఛను అందజేసి, వారి కుటుంబ సభ్యులకు స్వయంగా కాఫీ తయారు చేసి ఇచ్చిన విషయం విదితమే.

ఆ సందర్భంగా ఏడుకొండలు కుటుంబ పరిస్థితులపై ఆరా తీసి, ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల చెక్కును ప్రజా వేదిక వద్దే ముఖ్యమంత్రి చేతుల మీదుగా అప్పటికప్పుడే అందజేశారు. కాగా, ముఖ్యమంత్రి రాకతో తమ ఇంటికి వెలుగొచ్చిందని, హామీలు అమలు చేసి ఆ వెలుగు కలకాలం నిలిచేలా చేశారని ఏడుకొండలు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీవో మధులత, తహశీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులు స్పీకర్ పంపిణీ





**నర్సీపట్నం, మహానాడు:** స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఆరు నెలల కూటమి ప్రభుత్వం కాలంలో నియోజకవర్గంలోని 14 మందికి సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించడంలో స్పీకర్ కృషి చేశారు. నాతవరం మండలం నాతవరం గ్రామానికి చెందిన కొమ్మన శ్రీనివాస్‌కు ?1,80,000, గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన బేబీ ఘనేశ్వరికు ?1,53,000 చెక్కులు అందజేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఆరోగ్యం దేశాభివృద్ధి మూలస్తంభం. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆశాజ్యోతి కావాలి. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ఈ నిధి దోహదపడుతోంది, అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి రమణ, కాశీ, కొత్త ఎల్లవరం సర్పంచ్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు పశ్చిమ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నాలుగో మండల అధ్యక్షుడిగా వక్కలగడ్డ తిరుమలరావును బూత్ కమిటీ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక అరండల్ పేట ఆరో లైన్ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఎన్నిక కార్యక్రమం నాలుగో మండల మాజీ అధ్యక్షుడు పెమ్మరాజు సుధాకర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.**



# ధర్మవరంలో మరింత అభివృద్ధి, సంక్షేమం

- టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్



**ధర్మవరం, మహానాడు:** 2025లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో మరింత అభివృద్ధి, సంక్షేమం చూస్తారని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. నూతన సంవత్సరం వేళ ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడారు. రామగిరి మండలం వెంకటాపురం తో పాటు ధర్మవరంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల వరకు పరిటాల శ్రీరామ్ వెంకటాపురంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం అందుబాటులో ఉన్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ధర్మవరంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో కార్యాలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది.

# ప్రతిఒక్కరికీ మేలే లక్ష్యంగా కూటమి పాలన

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



**వినుకొండ, మహానాడు:** కొత్త సంవత్సరంలో రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ మేలు జరగాలి, ఆ మంచిని పదిమందితో పంచుకోవాలన్నదే తను దేవుడిని కోరుకునే ఒకేఒక్క విషయమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంజనేయులు కేకును కోసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు జీవీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నాగశ్రీను రాయల్, నిశ్శంకర శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి దంపతులు, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, పట్టణ, గ్రామీణ సీఐలు శరత్ బాబు, ప్రభాకర్, తదితరులు జీవీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జీవీ పిలుపు మేరకు ఆయనకు అభినందనలు తెలిపేందుకు వచ్చినవారు పుస్తకాలు, పెన్నులు, నిఘంటువులను పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఫొటోలు దిగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 2024 క్యాలెండర్లను ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నదుల అనుసంధానం ప్రణాళిక అందించారు. కెనాల్ ద్వారా నీరు ప్రవహించే మార్గంలోని పట్టణాలు, గ్రామాల చుట్టూ భారీ, మధ్య, చిన్న, సూక్ష్మ నీటి వనరుల నిల్వ ద్వార భూగర్భ జలాలు పెంచే విధానంపై డీపీఆర్ తయారు చేయించాలని కోరారు. 53.85 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం ఉన్న వెలిగొండ స్టోరేజ్ ట్యాంక్ కు అనుసంధానం చేయాలని తన లేఖలో కోరారు.**



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 02, జనవరి 2025









## దుర్గమ్మ సేవలో సీఎం చంద్రబాబు

**విజయవాడ:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన సంవత్సరం సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబుతో పాటు హోం మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నాగుల్ మీరా కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

దర్శనానంతరం పండితులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ముందుగా అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలతో వివిధ దేశాల్లో ఉన్న భారతీయులందరికీ న్యూ ఇయర్ విషెష్ తెలిపారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు వివరించారు. ఈ ఏడాది అన్నింటా శుభం జరుగుతుందని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు.

అందరికీ ఆదాయం పెరిగి, సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు.








## సిఎస్ విజయానంద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ

**అమరావతి:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర సచివాలయంలో పలువురు ఉన్నతాధికారులు, వివిధ శాఖాధిపతులు, సచివా లయం, ఇతర విభాగాల అధికారులు ఉద్యోగులు, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిఎస్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ప్రధానంగా డిజిపి ద్వారకా తిరుమల రావు,ప్రత్యేక ప్రధాన కార్య దర్శులు కృష్ణబాబు,ముఖ్య కార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా,కాంతిలాల్ దండే, జయలక్ష్మి, సునీత, శశిభూషణ్ కుమార్,కార్యదర్శులు, కలక్టర్లు, జెసిలు, వివిధ శాఖాధిపతులు, సచివాలయ ఉద్యోగులు, ఎపి రెవెన్యూ సర్వీసెస్,ఎపి ఎన్జిఓ తదితర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

















నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తిరుమల తిరుపతి దేవస్థాన అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ క్యాలెండర్, డైరీ, స్వామివారి చిత్రపటాన్ని సీఎం చంద్రబాబుకు ఈఓ శ్యామలరావు అందజేశారు.





జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 02, జనవరి 2025















**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఉండవల్లి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు.**


























09
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 02, జనవరి 2025

# ప్రతీ కుటుంబానికి ఆనందం ఉండాలి

**- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్**

**పాడేరు, మహానాడు:** అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండల కేంద్రంలోని కిడారి క్యాంప్ కార్యాలయంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కు బుధవారం అధికారులు, వివిధ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడారు. కొత్త సంవత్సరంలో ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కూటమి పాలనలో ప్రతి పేదవాడికి అభివృద్ధి, సంక్షేమం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన చేస్తుందన్నారు. టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్



నాయుడు, ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు, గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ బొర్రా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటా సంతోషాన్ని నింపుతాం!

**- మంత్రి ఫరూక్**

**నంద్యాల, మహానాడు:** ప్రతి ఇంటా సంతోష సంబరాలు నింపుతామని న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. తెలుగుదేశం పార్టీ(టీడీపీ) స్థానిక కార్యాలయం(రాజ్ టాకీస్) లో బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకలో మంత్రిని, పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ని , టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్‌లను పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచి, కార్యకర్తలు, నాయకులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల్లో గందరగోళ వాతావరణం నెలకొని ఉండేదని అన్నారు.



నరసరావుపేట పట్టణంలోని ఎంపీ క్యాంప్ ఆఫీసులో పలువురు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు



## సీఎం చంద్రబాబును కలిసిన పెమ్మసాని

**న్యూ ఇయర్ విషెస్ తెలిపిన కేంద్రమంత్రి**

**మంగళగిరి, మహానాడు:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం కలిశారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో అమరావతి, రాష్ట్ర అభివృద్ధిని కూటమి ప్రభుత్వం సాధించి తీరుతుందని ఈ సందర్భంగా పెమ్మసాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు మహమ్మద్ నసిర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్ కూడా కలిసి వెళ్లారు.



సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా సత్తెనపల్లిలోని వేణుగోపాల స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు.

ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ.. అనుబంధ సంఘాల నాయకులతో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏపీజేఏసీ అమరావతి క్యాలండర్, ఏపీ రెవిన్యూ సర్వీసెస్ అసోషియేషన్, పీపీటీడీ(ఆర్టీసీ)ఎంప్లాయీస్ యూనియన్, ఏపీ కో- ఆపరేటివ్ సర్వీసెస్ అసోషియేషన్, ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోషియేన్, ఏపీ హెడ్ మాస్టర్స్ అసోషియేషన్ (5 ప్రధాన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగులు)లకు సంబంధించిన డైరీలను, క్యాలండర్లను ఆవిష్కరించారు.









ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయానికి వచ్చారు. తనను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో సాయంత్రం వరకూ ఫోటోలు దిగారు. పలువురు దివ్యాంగులు, బాధితులు సమస్యలు వివరించి వినతి పత్రాలు అందించగా... వాటిని స్వీకరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.







## జేసీఐ అంతర్ జాతీయ కమీషన్ చైర్మన్‌గా హర్షవర్ధన్ రెడ్డి

**తిరుపతి, మహానాడు:** తిరుపతికి చెందిన ఎన్ బి హర్ష వర్ధన్ రెడ్డి జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా (జేసీఐ) అంతర్జాతీయ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు అంకుర్ జున్ జున్ వాలా బుధవారం ప్రకటించారు. ఆయన ఒక సంవత్సరం పాటు పదవిలో ఉంటూ అంతర్జాతీయ సంబంధాల నిర్వహణ, సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తారు. గతంలో ఆయన జాతీయ ఉపాధ్యక్షుడు, ఆసియా పసిఫిక్ డెవలప్ మెంట్ కౌన్సిల్ అధికారిగా పనిచేశారు. తనకు ఈ బాధ్యత అప్పగించి జాతీయ అధ్యక్షునికి హర్ష వర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకం పట్ల తిరుపతి జేసీఐ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## విధ్వంసానికి, విద్వేషాలకు దూరంగా కూటమి పాలన

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**

**దర్శి, మహానాడు:**
విధ్వంసానికి, విద్వేషాలకు దూరంగా, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తోందని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప



ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ఏడు నెలల్లో ప్రజలకు సంతృప్తి పాలన అందించి, ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా ఎంతో ఆనందంగా 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నామన్నారు. ఇదిలావుండగా, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ముండ్లమూరు మండలం, ఉల్లగళ్లు పంచాయతీ వైసీపీ సర్పంచ్ జనమాల నాగేంద్రం, పిచ్చయ్య వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.





తెనాలి క్యాంపు కార్యాలయంలో కొత్త సంవత్సరం రోజున ఆహార, పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ, పౌర సరఫరా శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, జనసేన కార్యకర్తలు, ప్రజలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 02, జనవరి 2025



## జనవరి 2న 'గేమ్ చేంజర్' థియేట్రికల్ ట్రైలర్

**- పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో రామ్‌చరణ్**

గ్లోబల్‌స్టార్ రామ్ చరణ్ భారీ పాన్ ఇండియా మూవీ 'గేమ్ చేంజర్'కి కౌంట్ డౌన్ షురూ అయ్యింది. మాస్టర్ ఫిల్మ్ మేకర్ శంకర్ ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాను తెరకెక్కించారు. సినిమాపై అంచనాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. మెగాభిమానులు, ప్రేక్షకులు సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా! అని ఎగ్జయిట్‌మెంట్‌తో వెయిట్ చేస్తున్నారు. ఈ ఎగ్జయిట్‌మెంట్‌ను నెక్స్‌ట్ రేంజ్‌కు తీసుకెళ్లే కార్యక్రమానికి చిత్ర యూనిట్ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జనవరి 2న 'గేమ్ చేంజర్' ట్రైలర్‌ను విడుదల చేసి న్యూ ఇయర్ ట్రీట్‌ను అందించటానికి సిద్ధమైంది. ఇప్పటి వరకు 'గేమ్ చేంజర్' నుంచి వచ్చిన సాంగ్స్, టీజర్, పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్‌తో ఎక్స్‌పెక్టేషన్స్ పీక్స్‌కి చేరుకున్నాయి. ఇప్పుడు ట్రైలర్ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. స్టార్ డైరెక్టర్ శంకర్ ప్రపంచంలో గ్లోబల్ స్టార్ ఎలా ఉంటాడో చూడాలని అందరూ వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ అంచనాలను అందుకుని ప్రేక్షకులను మెప్పిస్తుందని మేకర్స్ భావిస్తున్నారు.

## జనవరి 6న 'హరి హర వీరమల్లు పార్ట్-1 "మాట వినాలి"

ప్రాంతీయ భాషా చిత్రాలతోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది కథానాయకులలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన తన సినీ ప్రయాణంలో తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. యువ దర్శకుడు జ్యోతి కృష్ణ ఈ భారీ యాక్షన్ ఎపిక్‌ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్ర పాటల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అభిమానులు, ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపే వార్తను తాజాగా నిర్మాతలు పంచుకున్నారు. 'హరి హర వీర మల్లు' నుంచి 'మాట వినాలి' అంటూ సాగే మొదటి గీతాన్ని జనవరి 6వ తేదీన ఉదయం 9:06 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్‌ను వదిలారు. తుఫానుకి ముందు ప్రశాంతతలా, యుద్ధానికి ముందు చిరునవ్వు చిందిస్తూ ప్రశాంతంగా కనిపిస్తున్న యోధుడిలా ఉన్న పవన్ కళ్యాణ్ లుక్ పోస్టర్‌లో ఆకట్టుకుంటోంది. పెంచల్ దాస్ సాహిత్యం అందించిన ఈ గీతాన్ని పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ స్వయంగా ఆలపించడం విశేషం.





## తుది దశకు చేరుకున్న '7జి బృందావన కాలనీ 2' చిత్రీకరణ

దక్షిణ భాషా చిత్రాలలో కల్ట్ క్లాసిక్ సినిమాగా నిలిచిన వాటిలో '7జి బృందావన కాలనీ' చిత్రం ఒకటి. సినిమా విడుదలై రెండు దశాబ్దాలవుతున్నా, ఇప్పటికీ ఎందరికో అభిమాన చిత్రంగా ఉంది. అలాంటి కల్ట్ క్లాసిక్ చిత్రానికి సీక్వెల్ గా '7జి బృందావన కాలనీ 2' రూపొందుతోంది.

శ్రీ సూర్య మూవీస్ పతాకంపై పలు అద్భుతమైన బ్లాక్ బస్టర్ చిత్రాలను అందించిన ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సీక్వెల్ చిత్రీకరణ తుది దశకు చేరుకుందని నూతన సంవత్సరం సందర్భంగా చిత్ర బృందం ప్రకటించింది. '7జి బృందావన కాలనీ 2' చిత్రానికి ప్రముఖ దర్శకుడు సెల్వరాఘవన్ దర్శకత్వం వహిస్తున్నారు. కట్టిపడేసే కథా కథనాలు, హత్తుకునే భావోద్వేగాలతో ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించేలా అద్భుతంగా ఈ సీక్వెల్ ను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగంలో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల మనసు గెలిచిన రవికృష్ణ, మరోసారి తనదైన శైలిలో మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. ఆయన సరసన అనశ్వర రాజన్ నటిస్తున్నారు.



## ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్ 'జాక్'

డీజే టిల్లు ఫ్రాంచైజీ చిత్రాల బ్లాక్‌బస్టర్ తర్వాత స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తోన్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'జాక్‌లి కొంచెం క్రాక్'. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బొమ్మరిల్లు దర్శకత్వం వహిస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డ, బొమ్మరిల్లు భాస్కర్ కలయికలో సరికొత్త జోనర్‌లో'జాక్- కొంచెం క్రాక్' మూవీ రూపొందుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ 'జాక్- కొంచెం క్రాక్' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10న గ్రాండ్ లెవల్లో రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో న్యూ ఇయర్ సందర్భంగా మేకర్స్ అందరికీ విషెష్ తెలియజేస్తూ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ స్టార్‌బాయ్ సిద్ధు సింపుల్‌గానే కనిపిస్తున్నా స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. సిద్ధు టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీపై ఆడియెన్స్‌లో మంచి అంచనాలున్నాయి.

## జనవరి 24న 'గాంధీ తాత చెట్టు'



దర్శకుడిగా ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిన ప్రముఖ దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకురాలు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి శ్రీమతి తబితా సుకుమార్ సమర్పకురాలు. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మాతలు. ఇప్పటికే ఈ చిత్రం పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శింపబడి ఎన్నో అవార్డులు కైవసం చేసుకుంది. ఉత్తమ బాల నటిగా సుకృతి వేణి కూడా పురస్కారం పొందారు. కాగా ఈ చిత్రాన్ని జనవరి 24న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకురాలు పద్మావతి మల్లాది మాట్లాడుతూ " ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడా చూసిన ద్వేషాలు, అసూయ..ఇలా ఓ నెగెటివ్ వైబ్రేషన్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఒకరి మీద ఒకరు నిందలు వేసుకోవడం.. గొడవలు ఇలా ఎన్నో ఘర్షణలు కనిపిస్తున్నాయి. ఇక సాధారణంగా మనకు అహింస అనగానే మనకు మన జాతిపిత మహాత్మగాంధీ గుర్తొస్తారు. ఇలాంటి తరుణంలో గాంధీ సిద్ధాంతాలు అభిమానిస్తూ, ఆయన బాటను అనుసరించే ఓ పదమూడేళ్ల అమ్మాయి తను పుట్టిన ఊరిని కాపాడుకోవడం కోసం ఏం చేసింది? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు చూపించాల్సిన సినిమా. అందరి హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉంటాయి అన్నారు.

## 'షష్టిపూర్తి'లోని 'ఏదో ఏ జన్మలోదో' సాంగ్ విడుదల



రూపేష్ కథానాయకుడిగా మా ఆయి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన సినిమా 'షష్టిపూర్తి'. నట కిరీటి డా. రాజేంద్ర ప్రసాద్, రెండు సార్లు జాతీయ ఉత్తమ నటి పురస్కారం గెలుచుకున్న అర్చన ఇందులో ప్రధాన తారాగణం. క్లాసిక్ ఫిల్మ్ 'లేడీస్ టైలర్' విడుదలైన 38 ఏళ్ళ తర్వాత వాళ్ళిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. ఆకాంక్షా సింగ్ ఇందులో రూపేష్ సరసన కథానాయికగా నటించారు. పవన్ ప్రభ దర్శకుడు. రూపేష్ చౌదరి నిర్మాత. ఈ సినిమాలోని 'ఏదో ఏ జన్మ లోదో' సాంగ్ త్వరలో విడుదల చేయనున్నట్లు న్యూ ఇయర్ సందర్భంగా వెల్లడించారు. 'ఏదో... ఏ జన్మలోదో... ఈ పరిచయం' సాంగ్ స్పెషాలిటీ ఏమిటంటే... ఇసైజ్ఞాని ఇళయరాజా సంగీతం అందించగా, ఆస్కార్ విజేత - ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి సాహిత్యం సమకూర్చారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ "మా సినిమాలో ఐదు పాటలు ఉన్నాయి. చైతన్య ప్రసాద్ కొన్ని పాటలకు సాహిత్యం అందించారు. ప్రత్యేకమైన సందర్భంలో వచ్చే ఓ పాటకు కీరవాణి అయితే బావుంటుందని అనిపించింది. చైతన్య ప్రసాద్ కి కీరవాణి క్లోజ్. ఆయన ద్వారా అప్రోచ్ అయ్యాము. లక్కీగా ఆ టైంలో కీరవాణి చెన్నైలో ఉన్నారు. లంచ్ టైంలో వెళ్లి కలిశాము. సిట్యువేషన్ చెప్పి సాంగ్ రాయమని రిక్వెస్ట్ చేయగా, ఓకే అన్నారు. రామ్, భాగ్య శ్రీ జోడీ క్యూట్ గా ఉందని అందరూ చెబుతున్నారు. సినిమాలో వీళ్లిద్దరి మధ్య వచ్చే సీన్లు హైలైట్ అవుతాయి" అని దర్శక నిర్మాతలు తెలిపారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144